మన తొలివెలుగు

RNI· TGBIL/26/A2289


తెలుగు దినపత్రిక

www.manatolivelugu.in

CEO & Chief Editor : Vanga Nagaraj Reddy (Raju)

హైదరాబాద్ | శనివారం 31 అక్టోబర్ 2026 | సంపుటి : 1 | సంచిక : 139 | పేజీలు : 8 | వెల : 2/-





యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం

- యూసీసీ అమలు చేస్తాం
- 30 ఏళ్ల వరకు ఎస్పీకి అధికారం లేదు
- రామభక్తులపై కాల్పులను గుర్తుచేసిన షా
- ఓటు చోరీపై చర్చకు సిద్ధం
- యూసీసీపై దేశవ్యాప్త చర్చ



కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై కీలక నిర్ణయం

- మధ్యవర్తిగా జస్టిస్ దేశాయ్ నియామకం
- ఇరుపక్షాల అంగీకారంతో నిర్ణయం
- పరిష్కారానికి నిపుణుల సహకారం
- మధ్యవర్తిత్వానికి పూర్తి సహకారం
- నాలుగు వారాల తర్వాత సమీక్ష
- విచారణ నిలిపివేతకు గతంలో నిరాకరణ



సింగరేణి కార్మికులకు మరో బోనస్

- ఒక్కొక్కరికి రూ. 1.10 లక్షలు!
- సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.10 లక్షల చొప్పున చెల్లింపు
- నవంబర్ 5న కార్మికుల ఖాతాల్లోకి రూ. 419 కోట్లు జమ
- దసరా, దీపావళి బోనస్‌లు కలిపి ఒక్కో కార్మికుడికి రూ. 2.65 లక్షల లబ్ధి
- సుమారు 38,000 మంది కార్మికులకు ప్రయోజనం

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు మరో శుభవార్త అందించింది. ఇటీవల దసరా పండుగ సందర్భంగా భారీ బోనస్ అందుకున్న కార్మికులకు, ఇప్పుడు దీపావళి కానుకగా మరో భారీ బోనస్‌ను ప్రకటించింది. దీని కింద ఒక్కో కార్మికుడికి గరిష్ఠంగా రూ. 1,10,250 చొప్పున మొత్తం రూ. 419 కోట్లను చెల్లించనుంది. ఈ నిర్ణయంతో సింగరేణి వ్యాప్తంగా ఉన్న సుమారు 38,000 మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు. నెల రోజుల వ్యవధిలోనే సింగరేణి కార్మికులు రెండు భారీ బోనస్‌లు అందుకోనుండటం - మిగతా3లో

వేగంగా రైలు కారిడార్లు



- హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలి
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- కొత్త రైలు మార్గాలకు ప్రతిపాదనలు
- రీజినల్ రింగ్ రైలుకు విజ్ఞప్తి
- బైపాస్ లైన్లకు మంజూరు కోరుతూ
- అనంతారంలో మెగా డిపో

న్యూఢిల్లీ

తెలంగాణకు ప్రతిపాదించిన హైస్పీడ్ రైలు కారిడార్ల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో సమావేశమైన సీఎం రాష్ట్రానికి సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. హైదరాబాద్–పుణె, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్లకు సంబంధించి కేంద్రం ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌లో - మిగతా3లో



ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

- ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో కుప్పకూలిన హెలికాప్టర్
- బద్రీనాథ్ నుంచి బయల్దేరిన కాసేపటికే గాల్లో సంబంధాలు కోల్పోయిన విమానం
- మృతుల్లో పైలట్‌తో పాటు కర్ణాటకకు చెందిన ఐదుగురు యాత్రికులు
- ప్రమాదం నేపథ్యంలో ట్రాన్స్ భారత్ ఏవియేషన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత
- వరుస ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ సీఎం హరీశ్ రావత్



ప్రతి పల్లెకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక!

- దేశంలోనే తొలిసారిగా జీపీఎస్ఏపీ
- ఐదేళ్ల అభివృద్ధికి కార్యాచరణ
- మూడు భాగాలుగా ప్రణాళిక
- ప్రతి గ్రామానికి ప్రత్యేక వెబ్‌సైట్
- ఇంటింటికీ వెళ్లి డేటా సేకరణ
- తప్పుడు సమాచారమిస్తే చర్యలు
- నెలవారీ సమావేశాల్లో సమీక్ష
- కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యత

హైదరాబాద్

తెలంగాణలోని పల్లెలను సమగ్రంగా అభివృద్ధి చేసి, 'రైజింగ్ తెలంగాణ–2047' లక్ష్య సాధనలో భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ప్రతి గ్రామపంచాయతీకి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీఎస్ఏపీ–2026) రూపొందించేందుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల ప్రస్తుత పరిస్థితులు, అవసరాలు, వనరులు, అభివృద్ధి పనుల వివరాలతో - మిగతా3లో

మియాపూర్ 550 ఎకరాలపై కేసీఆర్ కన్ను!



- భూములను కాపాడేందుకు సుప్రీంకోర్టులో పోరాడాం
- కేసీఆర్‌పై సీఎం తీవ్ర ఆరోపణలు
- రూ.50 వేల కోట్ల భూములకు రక్షణ
- వేలం వేసి సంక్షేమానికి నిధులు
- కంచ గచ్చిబౌలి భూముల పరిరక్షణ
- హరీశ్‌రావు బంధువుపై ఆరోపణలు
- పద్మాలయ, ల్యాంకో భూముల ప్రస్తావన
- 400 ఎకరాలకు ఫెన్సింగ్
- ప్రభుత్వ భూములుగా రికార్డులు

హైదరాబాద్

మియాపూర్‌లోని 550 ఎకరాల విలువైన భూములను స్వాధీనం చేసుకునేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్, ఆయన బంధువులు ప్రయత్నించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ భూముల వ్యవహారంలో గోల్డ్‌స్టోన్ ప్రసాద రావు కీలకంగా వ్యవహరించారని, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదరరావుకు ఖరీదైన కారును బహుమతిగా ఇచ్చారంటూ సీఎం వ్యాఖ్యానించారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన మియాపూర్ భూముల వ్యవహారంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రభుత్వ భూముల పరిరక్షణపై వివరించారు. మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కాపాడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కొందరు అధికారులను అడ్డుపెట్టుకుని భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించారని, ఈ వ్యవహారంలో - మిగతా3లో



49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

- 2.6 శాతానికి తీవ్ర పేదరికం.. ఉపాధితో తగ్గిన పేదరికం
- సంక్షేమ పథకాలతో ఊరట.. 2028 నాటికి మరింత తగ్గుదల
- గ్రామీణ ప్రాంతాల్లో పురోగతి.. వీడని ఆదాయ అసమానతలు

జనవరి 25 నుంచి జనగణన

- ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మినహాయింపు
- మార్చి 1 అర్ధరాత్రి కీలక గడువు
- జనవరి 10 నుంచే స్వీయ నమోదు
- రెండు దశల్లో జనాభా లెక్కింపు
- జనగణనకు రూ.11,718 కోట్ల కేటాయింపు
- కరోనా కారణంగా ఐదేళ్లు ఆలస్యం
- చివరిసారిగా 2011లో జనాభా లెక్కింపు



ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

- చివరి శ్వాస వరకు ప్రజాసేవ.. దేశం కష్టాల్లో ఉంటే సంబరాలా?
- ఎరువులు, గ్యాస్‌పై దుష్ప్రచారం.. రైతులపై ధరల భారం పడనివ్వం
- రైతు సంక్షేమమే లక్ష్యం.. పీఎం-కిసాన్‌కు రూ.4.5 లక్షల కోట్లు
- బనాస్కాంత రైతులపై ప్రశంసలు.. పశుసంవర్ధక రంగానికి ప్రోత్సాహం

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

ఉత్తరాఖండ్‌లో శుక్రవారం ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ దుర్ఘటన విషాదాంతంగా ముగిసింది. బద్రీనాథ్ నుంచి సహస్త్రధార వెళుతున్న ఓ ప్రైవేట్ హెలికాప్టర్ జోషిమఠ్ సమీపంలోని చాయ్ గ్రామ సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్‌తో సహా హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద వార్త అందిన వెంటనే ఉత్తరాఖండ్ పోలీస్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం ఆర్మీ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుల్లో హెలికాప్టర్ పైలట్ కెప్టెన్ హిమాన్షు సభర్వాల్ (ఢిల్లీ) కాగా, ప్రయాణికులను ప్రతాప, అరుణ్, శంకర్ గౌడ, సుధీర్ కె, హెచ్.ఎస్. నటరాజాగా గుర్తించారు. వీరంతా కర్ణాటకకు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలం నుంచి ఆరుగురి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు ధ్రువీకరించారు. మృతదేహాలను రోడ్డు మార్గం ఉన్న ప్రాంతానికి తరలించే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.



రెండు నిమిషాల్లోనే తెగిన సంబంధాలు

చమోలీ ఎస్పీ సుర్జీత్ సింగ్ పన్వార్ వెల్లడించిన వివరాల ప్రకారం, "ట్రాన్స్ భారత్ ఏవియేషన్" సంస్థకు చెందిన ఈ హెలికాప్టర్ మధ్యాహ్నం 1.12 గంటలకు బద్రీనాథ్ సివిల్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరింది. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే, మధ్యాహ్నం 1.14 గంటల సమయంలో జోషిమఠ్ సమీపంలో హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. హెలికాప్టర్ గాల్లో ఉండగానే అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లడం చూశామని సమీప ప్రాంతాల్లోని స్థానికులు తెలిపారని ఆయన వివరించారు. ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖజణూ) కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. హెలికాప్టర్‌తో కమ్యూనికేషన్ తెగిపోవడంతో పాటు, ట్రాకింగ్ సిస్టమ్ నుంచి కూడా అది అదృశ్యమైనట్లు తెలిపింది.

సంస్థ సేవలు నిలిపివేత

ఈ దుర్ఘటన నేపథ్యంలో, ముందుజాగ్రత్త చర్యగా ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన అన్ని హెలికాప్టర్ల సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యూసీడీఏ ప్రకటించింది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హెలికాప్టర్ ప్రమాదాలపై ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హరీశ్ రావత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది చాలా బాధాకరమైన విషయం. రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలను సురక్షితంగా మార్చాల్సిన అవసరం ఉంది. వరుసగా ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తగిన మార్పులు చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

యూపీ నుంచి బెంగాల్ వరకు పేదరికంభారతదేశంలో తీవ్ర పేదరికం 12 ఏళ్ల కాలంలో అత్యంత వేగంగా క్షీణించిందని వరల్డ్ బ్యాంక్ తన తాజా నివేదికలో వెల్లడించింది. 2011 సంవత్సరంలో ఏకంగా దేశ జనాభాలో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం రేటు, 2023 నాటికి 2.6 శాతానికి పడిపోయిందని స్పష్టం చేసింది. ఈ కాలంలో భారతదేశం సుమారు 496 మిలియన్ల మంది ప్రజలను (49.6 కోట్లు) విజయవంతంగా పేదరికం నుంచి బయటపడేసిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. 'ఇండియా పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్: అక్టోబర్ 2026' పేరిట విడుదలైన ఈ రిపోర్ట్ ప్రకారం– ఈ పేదరికం అంచనాలను 2021 కొనుగోలు–శక్తి– సమతుల్యత (ppp– పర్చేజింగ్, పవర్, పారిటీ) ఆధారంగా లెక్కించారు. వరల్డ్ బ్యాంక్ ఈ నివేదికలో పేదరికాన్ని అంచనా వేయడానికి రోజుకు 4.20 డాలర్ల ఆదాయాన్ని దిగువ మధ్య ఆదాయ దేశాల పేదరిక పరిమితిగా, రోజుకు 3 అమెరికన్ డాలర్లను తీవ్ర పేదరిక ప్రమాణంగా తీసుకొని ఈ గణాంకాలను వెల్లడించింది.

2011–2023 మధ్య కాలంలో రోజుకు 4.20 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న జనాభా వాటా 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది. ఈ మార్పుతో సుమారు 49.6 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్లు ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది. అదే సమయంలో రోజుకు 3 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించే తీవ్ర పేదరికం రేటు– 27.1 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గించిన దేశాల్లో భారత్ కూడా ఒకటని వరల్డ్ బ్యాంక్ అభిప్రాయపడింది. గత దశాబ్ద కాలంలో భారత్– పేదరికాన్ని తగ్గించడంలో అద్భుతమైన పురోగతిని సాధించిందని పేర్కొంది. పేదరికం తగ్గినా ఆదాయ అసమానతలు మాత్రం కొనసాగుతున్నట్లు ప్రపంచ బ్యాంకు తెలిపింది. ఇక్కడ ఎక్కువగా సంపాదించే వారు, తక్కువగా సంపాదించే వారి ఆదాయం మధ్య భారీ వ్యత్యాసం ఉందని స్పష్టం చేసింది.

పేదరికం తగ్గడానికి కారణాలివే!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ వరల్డ్ బ్యాంక్ రిపోర్ట్‌పై ఎక్స్ వేదికగా స్పందించారు. భారతదేశంలో పేదరికం తగ్గడానికి కారణాల్ని కూడా వరల్డ్ బ్యాంక్ ప్రస్తావించినట్లు ఆమె తెలిపారు. వినియోగ వ్యయం



పెరగడం, మెరుగైన ఉపాధి అవకాశాలు ముఖ్యంగా మహిళలకు ఉద్యోగ అవకాశాలు పెరగడం, ఆహార సబ్సిడీలతో పాటు ఇతర సామాజిక సంక్షేమ పథకాలు విస్తరించడం వంటివి పేదరికం తగ్గడానికి దోహదపడ్డాయని ప్రపంచ బ్యాంక్ గుర్తించినట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన నిర్ణయాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కారణంగానే ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని, తీర్పును గెల్చుకుంటోందని ఆమె అన్నారు. ఉపాధి అవకాశాల్ని మరింత పెంచడం, కుటుంబ ఆదాయాల్ని బలోపేతం చేయడం, ప్రజా సేవల పంపిణీ ద్వారా పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పుకొచ్చారు. రాబోయే సంవత్సరాల్లోనూ భారతదేశంలో పేదరికం తగ్గే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. రోజుకు 4.20 డాలర్ల ఆదాయ పరిమితి ప్రకారం 2026లో పేదరికం రేటు 14.2 శాతం నుంచి, 2028 నాటికి 12.1 శాతానికి తగ్గొచ్చని పేర్కొంది. అయితే ఇది ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా రూపొందించిన ప్రాథమిక అంచనాలేనని, ఉపాధి, ఆర్థిక గణాంకాల్లో మార్పులు వచ్చినప్పుడు దానికి అనుగుణంగా ఇది మారొచ్చని తెలిపింది.

గ్రామీణ ప్రాంతాల్లో పురోగతి అయినా!


గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాల జీవన ప్రమాణాలు ఇటీవలి కాలంలో మెరుగుపడ్డాయని ప్రపంచ బ్యాంక్ నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం వేగంగా తగ్గడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని స్పష్టం చేసింది. అయితే ఇప్పటికీ పేద కుటుంబాల్లో ఎక్కువ భాగం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నారని నివేదిక తెలిపింది. ప్రధానంగా అక్కడ ఉత్పాదకత తక్కువగా ఉండటం, వ్యవసాయం కాకుండా ఇతర మెరుగైన ఉద్యోగాలు అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్యలు అని వివరించింది. దేశంలో పేద జనాభాలో దాదాపు 57 శాతం మంది ఉత్తర్ ప్రదేశ్ నుంచి బెంగాల్ వరకు విస్తరించిన రాష్ట్రాల్లోనే ఉన్నారని రిపోర్ట్ తెలిపింది. దేశవ్యాప్తంగా పేదరికాన్ని మరింత తగ్గించాలంటే ఈ రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాల్ని మరింత పెంచడం కీలకం అని సూచించింది.

యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం

ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర హోంమంత్రి అమిత్? షా శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే దీనిని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని వెల్లడించారు.

మమ్మల్ని ఎవరూ కదిలించలేరు!

ప్రస్తుతం యూపీలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని అమిత్ షా అన్నారు. "యూపీ లో బీజేపీ ప్రభుత్వం అంగదుడి పాదం (కదిలించలేనిది) లాంటిది. దీనిని ఎవరూ కదిలించలేరు. బీజేపీ మళ్లీ యూపీలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అని పేర్కొన్నారు. మరోవైపు సమాజ్?వాదీ పార్టీ ఇకపై యూపీలో అధికారంలోకి రాదని అమిత్ షా అన్నారు. "అఖిలేశ్ బాబూ, గుర్తుంచుకోండి. వచ్చే 30 ఏళ్ల వరకు మీ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ప్రజలు మీ మూడో తరానికి కూడా క్షమించరు" అని అన్నారు. ఈ సందర్భంగా 1990 అక్టోబర్ 30న అయోధ్యలో కరసేవకులపై పోలీసులు జరిపిన కాల్పులను అమిత్ షా ప్రస్తావించారు. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం పోరాడుతున్న కరసేవకులపై సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోలీసులు కాల్పులు జరిపారని ఆయన గుర్తు చేశారు. "నేను (సమాజ్‌వాదీ పార్టీ) వారిని అడగాలని అనుకుంటున్నాను. ఏ ప్రాతిపదికన మీరు ప్రభుత్వం ఏర్పాటు గురించి మాట్లాడుతున్నారు మీరు రామభక్తులపై కాల్పులకు ఆదేశించారు. కానీ మేము రామమందిరాన్ని నిర్మించాం" అని పేర్కొన్నారు.



ఓటు చోరీపై ఏమన్నారంటే?

మరోవైపు విపక్షాలు చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలపై కూడా అమిత్ షా మండిపడ్డారు. వారిని మ్యాచ్ ఓడిపోయిన తర్వాత అంపైర్?ను నిందించే జట్టుతో పోల్చారు. "మ్యాచ్ ఓడిపోయిన తర్వాత, వాళ్లు అంపైర్‌ను నిందిస్తున్నారు. ఓట్ చోరీ జరిగిందని ఆరోపిస్తున్నారు. పార్లమెంట్?లో ఈ అంశంపై చర్చకు బీజేపీ సిద్ధంగా ఉంది. ఈ రోజే వచ్చి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోనివ్వండి. మేము ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడానికి సిద్ధంగాఉన్నాం. పార్లమెంట్‌లో చర్చ జరగనివ్వండి" అని అన్నారు.

కాగా, ఈ రోజు ఉత్తరప్రదేశ్‌లోని డాక్టర్ రామ్? మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని అమిత్ షా ప్రారంభించారు. తమ పార్టీ సిద్ధాంతకర్తలైన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటాలకు ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్? మౌర్య, బ్రజేశ్ పాఠక్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతిపై చర్చ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా యూసీసీని అమలు చేయాలని పలు రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు పిలుపునిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా కూడా యూసీసీ అమలు గురించి మాట్లాడడం గమనార్హం. ఇటీవల అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ దేశవ్యాప్తంగా యూసీసీ అమలు చేయాలని పిలుపునిచ్చారు. యూసీసీ లేకపోవడం వల్ల ఎక్కువగా నష్టపోతున్న వారిలో ముస్లిం మహిళలు ఉన్నారని ఆయన అన్నారు. బహుభార్యత్వం లాంటి సమస్యలను పరిష్కరించడానికి ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసోంలో ఇప్పటికే యూసీసీని నోటిఫై చేశామని ఆయన గుర్తు చేశారు.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ కూడా యూసీసీ ప్రస్తుతం చాలా అవసరమని వ్యాఖ్యానించారు. చట్టంలో ఏకరూపత తీసుకురావడానికి కేంద్ర పౌరస్మృతి ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇటీవల మాట్లాడుతూ, ఉత్తరాఖండ్, గుజరాత్‌ల తరహాలో తమ ప్రభుత్వం 6నెలల్లోగా లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాలు ప్రవేశపెట్టి, రాష్ట్రంలో యూసీసీని అమలు చేస్తామని ప్రకటించారు. అంతేకాదు బంగాల్? కోసం ఏకరూప పౌరస్మృతి ముసాయిదాను పరిశీలించడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్? రంజనా ప్రకాశ్ దేశాయ్? నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. బంగాల్ సర్కార్? ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం, యూసీసీ ద్వారా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతకు సంబంధించిన విషయాల్లో అన్ని వర్గాల వారికి సమానంగా పౌరచట్టాలను వర్తింపజేస్తారు.

జనవరి 25 నుంచి జనగణన

భారతదేశ వ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన మొదలవుతుందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. అయితే ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, మణిపుర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో జనగణన ఉండదని స్పష్టం చేసింది. అలాగే మంచు కురిసే జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ జనగణన ఉందని పేర్కొంది. భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీఐ), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ జారీ చేసిన ప్రకారం, జనాభా గణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలుగా నిర్ణయించారు. ఆర్‌జీఐ ప్రకారం, జనగణన ప్రక్రియలో భాగంగా 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు 'సవరణ దశ' (రివిజినల్ రౌండ్) ఉంటుంది. ఇంటింటికీ తిరిగి జనాభాను లెక్కించే ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు, అంటే 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే (సెల్ఫ్–ఎన్యూమరేషన్) అవకాశం కల్పిస్తారు.

రెండు దశల్లో గణన

భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన ఇది. దీనిని రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటిది గృహాల జాబితా తయారీ, గృహ గణన, రెండోది జనాభా లెక్కింపు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగాల్సిన ఈ ప్రక్రియ ఈసారి కాస్త లేటయ్యింది. వాస్తవానికి జగగణన 2021లోనే జరగాల్సి ఉండగా, కోవిడ్–19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఈ భారీ జనాభా గణన ప్రక్రియ కోసం కేంద్ర మంత్రివర్గం రూ.11,718 కోట్లు కేటాయించింది. వాస్తవానికి, గతంలోనే మణిపూర్‌లో 2027 జనాభా గణనకు సంబంధించి గృహాల జాబితా తయారీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు =+× జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. భారతదేశంలో చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. అప్పుడు దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది; ఇందులో 62.32 కోట్ల మంది పురుషులు, 58.75 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఆ సమయంలో దేశంలో 24.95 కోట్ల కుటుంబాలు ఉన్నాయి

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

దేశానికి అన్నదాతలే మూల స్తంభాలని, తన చివరి శ్వాస వరకు ప్రజా సేవలో పునరంకితమవుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గుజరాత్‌లోని బనాస్కాంత జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా 'భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రధాని ప్రారంభించారు. దీంతో పాటు రూ.14,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. 'నా జీవితంలో చివరి క్షణం వరకు ప్రజల సేవలోనే నిమగ్నమై ఉంటాను. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి, కుటుంబంలోని ఏ తరంలోనూ కనీసం పంచాయతీ సర్పంచ్‌గా కూడా ఎవరూ పనిచేయని నేపథ్యం ఉన్న నాకు, మీరు మొదట గుజరాత్‌కు, ఆ తదనంతరం భారతావనికి సేవ చేసే గొప్ప బాధ్యతను, అవకాశాన్ని అప్పగించారు. నేను సాధించిన ప్రతి విజయానికి, పొందిన ప్రతి పురోగతికి మూలం దేశ ప్రజలే. ఈ దేశ ప్రజల రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను. జీవితాంతం వారికి రుణపడి ఉంటాను' అని మోదీ అన్నారు.

విపత్తుల వేళ దుష్ప్రచారం

పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వేళ ప్రతిపక్షాలు అనుసరిస్తున్న వైఖరిపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశం ఏదైనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు ఆనందించే మనస్తత్వం ఉన్న కొందరు వ్యక్తులు మన మధ్యే ఉన్నారని మోదీ విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం తలెత్తిన సమయంలో దేశంలో తీవ్రస్థాయిలో ఎరువుల కొరత ఏర్పడుతుందని, వంటగ్యాస్ సరఫరా నిలిచిపోతుందంటూ కావాలని పుకార్లు సృష్టించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే ఏకైక లక్ష్యంగా ఈ అసత్య ప్రచారాలు చేశారని దుయ్యబట్టారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు ఆకాశాన్నంటినప్పటికీ, ఆ ధరల భారాన్ని భారతీయ రైతులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం ఆ ఖర్చును భరించిందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఎరువులు, గ్యాస్ కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. "దేశంలోని ప్రతి రైతు, యువకుడు, ఆడబిడ్డ 'వికసిత భారత్' నిర్మాణ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. కానీ దురదృష్టవశాత్తూ ఇది కొందరికి నచ్చటం లేదు. దేశం కష్టాల్లో ఉంటే చూడాలనుకునే వాళ్లు దేశంపైకి ఏదైనా ఆపద వస్తే వారికి ఎంతో ఆనందం. ఇరాన్, గల్ఫ్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధమే దీనికి తాజా ఉదాహరణ. ఈ యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సమైక్యంగా సన్నద్ధమవుతుంటే.. వీళ్లు మాత్రం వదంతులు వ్యాప్తి చేయడంలో బిజీగా ఉన్నారు. కావాలనే తప్పుడు ప్రచారాలు సృష్టించారు. రైతులకు ఎరువులు దొరకవని భయపెట్టారు. కృత్రిమంగా క్యూలైన్లు సృష్టించి వాతావరణాన్ని చెడగొట్టారు. ఇకపై గ్యాస్ సిలిండర్లు దొరకవని మహిళలను భయపెట్టారు. దేశంలో అశాంతి, గందరగోళం సృష్టించడమే వారి లక్ష్యం"

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రధాని పునరుద్ఘాటించారు. దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ఆసరాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 'పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా రూ. 4.5 లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, పశుసంవర్ధక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నూతన ఉత్తేజం అందిస్తున్నామని తెలిపారు. బనాస్కాంత జిల్లా వ్యవసాయ, సహకార రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రధాని ప్రత్యేకంగా మోదీ కొనియాడారు. ఇక్కడి రైతుల శ్రమ, పట్టుదల దేశానికే ఆదర్శమని చెప్పారు. బనాస్కాంత ప్రాంతంలో పండే బంగాళాదుంపలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. ఇక్కడి రైతు వద్దకు వచ్చి 'మేము బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేసి ఇస్తాం' అని చెప్పే ధైర్యం ఎవరూ చేయలేరన్నారు. ఎందుకంటే, తమ కష్టంతో బంగాళాదుంపల ద్వారా బంగారాన్ని ఎలా పండించాలో ఇక్కడి రైతులకు బాగా తెలుసని చెప్పారు.

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై సుప్రీం కీలక నిర్ణయం

కృష్ణా– గోదావరి (కేజీ) బేసిన్ గ్యాస్ వివాదానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇతరుల మధ్య ఉన్న కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌ను ఏకైక మధ్యవర్తిగా నియమించింది. ఈ మధ్యవర్తిత్వానికి అన్ని పక్షాలు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చాయని వెల్లడించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, ఇతర న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎమ్. పంచోలిలతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ నియామకాన్ని ప్రకటించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ముందుకు కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు కేసు విచారణకు వచ్చింది. ఈ వివాదానికి సంబంధించి అన్ని పక్షాలు ఒక ఆచరణాత్మక పరిష్కారాన్ని కనుగొనలేకపోయాయన్న సమాచారం ధర్మాసనం దృష్టికి చేరింది. ఈ కేసులో రిలయన్స్ ఇండస్ట్రీస్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు. 'ఈ వివాదాన్ని కోర్టు వెలుపల పరిష్కరించుకోగలమేమో చూద్దాం. ఈ కేసులో మీరు (సుప్రీంకోర్టునుద్దేశించి) ఎవరిని మధ్యవర్తిగా నియమించాలనుకుంటే వారిని నియమించండి' అని సిబల్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందించింది. కేజీ బేసిన్ వివాదానికి సంబంధించి మధ్యవర్తిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ పేరును ప్రతిపాదించింది. ఆమెకు ఉన్న కమర్షియల్ లిటిగేషన్ బ్యాక్‌గ్రౌండ్, పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని ఇరు పక్షాలు పరిష్కారం కోసం ప్రయత్నించాలని పిలుపునిచ్చింది. అలాగే ఇరుపక్షాలు సూచించిన ఇద్దరు నిపుణుల సహాయాన్ని తీసుకోవాలని మధ్యవర్తిని కోరతామని పేర్కొంది.

'వివాద పరిష్కారంలో మధ్యవర్తికి పూర్తిగా సహకరిస్తాం'

మరోవైపు, కేజీ బేసిన్ వివాదంలో కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. తాము మధ్యవర్తికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇరు పక్షాలు మధ్యవర్తి ముందు తమ ప్రజెంటేషన్ ఇవ్వొచ్చని అన్నారు. మధ్యవర్తి ముందు పక్షాలు తమ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా కొంత సమయం కేటాయించాలని ధర్మాసనాన్ని కోరారు.

మియాపూర్ 550 ఎకరాలపై కేసీఆర్ కన్ను!

-మొదటిపేజీ తరువాయి

సంబంధిత అధికారులు కూడా అరెస్టయ్యారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించామని, సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి రూ.50 వేల కోట్ల విలువైన ఆస్తిని కాపాడగలిగామని పేర్కొన్నారు. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

వేలం వేసి ప్రజా సంక్షేమానికి..

మియాపూర్ భూములను అవసరమైతే వేలం వేసి వచ్చిన నిధులను దళిత, బహుజన వర్గాల సంక్షేమానికి ఖర్చు చేస్తామని సీఎం ప్రకటించారు. గతంలో ఎంపీగా ఉన్న సమయంలో భూకబ్జాలపై పోరాడినందుకు తనను జైలుకు పంపించారని గుర్తుచేశారు. భూముల విక్రయం ద్వారా వచ్చే ఆదాయాన్ని నీటిపారుదల, విద్య, వైద్య రంగాలకు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని, దీనిపై మంత్రివర్గంలో చర్చిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడినట్లు చెప్పారు.

పలు ప్రాంతాల్లో భూముల పరిరక్షణ

కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి భూముల విషయంలో న్యాయపోరాటం చేసి ప్రభుత్వ భూములను రక్షించామని సీఎం తెలిపారు. గుర్రంగూడలో అటవీ భూముల ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకున్నామని, మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కూడా కాపాడామని పేర్కొన్నారు. ఆ భూమిలో ప్రస్తుతం పోలీసుల పిల్లల కోసం పాఠశాల నిర్మించినట్లు వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు అప్పగించారని ఆరోపిస్తూ, ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎల్బీనగర్‌లో 150 ఎకరాలను అటవీ ప్రాంతంగా అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు.

హరీశ్‌రావు బంధువుపై ఆరోపణలు

మాజీ మంత్రి హరీశ్‌రావు మామ హనుమంతరావు భూముల ఆక్రమణకు పాల్పడ్డారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.



సంబంధిత భూముల సర్వేకు అధికారులు ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారని, కోర్టు నుంచి స్టే తీసుకొచ్చారని విమర్శించారు. భూ ఆక్రమణలపై శాసనసభలో చర్చకు రావాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

పద్మాలయ, ల్యాంకో భూములపై ప్రశ్నలు

ఉమ్మడి రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీశ్‌రావులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని సీఎం ప్రశ్నించారు. గతంలో కేసులు వేసిన వారితోనే ఆ తర్వాత రాజకీయంగా సన్నిహితంగా వ్యవహరించారని ఆరోపించారు. మియాపూర్ భూముల విషయంలో ఇకనైనా వివాదాలు సృష్టించడం మానుకోవాలని సూచించారు. భూ ఆక్రమణలపై చర్చించేందుకు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు.

ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో నమోదు

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న భూములను పరిశీలించారు. ఈ భూములు హెచ్ఎండీఏ అధీనంలోనే ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 400 ఎకరాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని, మిగిలిన ప్రాంతంలోనూ త్వరలో పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. సెటిల్‌మెంట్ రికార్డుల ప్రకారం ఈ భూములు ప్రభుత్వ భూములుగా నమోదై ఉన్నాయని వివరించారు. 1949లోనే జాగీర్దార్ నుంచి ప్రభుత్వానికి భూములు సంక్రమించాయని పేర్కొన్నారు. 1995లో ప్రారంభమైన వివాదం సుమారు 23 ఏళ్ల పాటు న్యాయస్థానంలో కొనసాగిందని తెలిపారు. అవసరమైన రికార్డులను కోర్టుకు సమర్పించడం వల్లే భూములను తిరిగి పొందగలిగామని చెప్పారు. సర్వే నంబర్ల పరిధిలో ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లడం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రతి పల్లెకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక!

-మొదటిపేజీ తరువాయి

పాటు రాబోయే ఐదేళ్లకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రణాళిక రూపకల్పనలో పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు అధికారుల బాధ్యతలను నిర్దేశించింది. తప్పుడు సమాచారం ఇచ్చినా, వివరాలను ఉద్దేశపూర్వకంగా దాచినా చర్యలు తప్పవని స్పష్టం చేసింది.

జీపీఎస్ఏపీ తయారీకి మార్గదర్శకాలు


గ్రామాల స్వయం సమృద్ధి, సమగ్ర వికాసమే లక్ష్యంగా పంచాయతీరాజ్ శాఖ నిబంధనలను ఖరారు చేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పంచాయతీరాజ్ చట్టం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, తెలంగాణ రైజింగ్--2047కు అనుగుణంగా ప్రతి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందించనున్నారు. ఈ ప్రణాళికను మూడు విభాగాలుగా శాస్త్రీయ పద్ధతిలో సిద్ధం చేయాలని ప్రభుత్వం సూచించింది.

మూడు భాగాలుగా అభివృద్ధి ప్రణాళిక

మొదటి భాగంలో గ్రామంలోని ప్రస్తుత పరిస్థితులు, అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలను పొందుపరుస్తారు. రెండో భాగంలో రాబోయే మూడు నుంచి ఐదేళ్లలో గ్రామానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను సమగ్ర దృక్పథంతో రూపొందిస్తారు. గత ఆర్థిక సంవత్సర నిధులు, ప్రస్తుత ఏడాది ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుంటారు. మూడో భాగంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, వాటి నెలవారీ లక్ష్యాలు, పురోగతిని నమోదు చేస్తారు. గ్రామ అవసరాలు, ప్రజల ప్రాధాన్యతల ఆధారంగా పనులను ఎంపిక చేస్తారు.

ప్రతి గ్రామానికి ప్రత్యేక వెబ్‌సైట్

ప్రణాళిక తయారీ కోసం పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించాలి. ఉపాధి స్థితి, గృహ వసతి, భూమిలేని నిరుపేద కూలీలు, బలహీన వర్గాలు, పశు



సంపద, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలి. సేకరించిన సమాచారంతో ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించడంతోపాటు ప్రతి నెలా ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలి. ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేయడంతో పాటు అభివృద్ధి పనుల పర్యవేక్షణకు డాష్‌బోర్డులను అందుబాటులోకి తీసుకురానున్నారు.

తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు

గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది అడిగిన వివరాలను తప్పనిసరిగా అందించాలి. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చినా, వివరాలను దాటవేసినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. నమోదయ్యే వివరాల్లో పొరపాట్లు లేకుండా చూసే బాధ్యతను మండల స్థాయి ఇంజినీరింగ్, ఉపాధి హామీ, సెర్ప్, పంచాయతీరాజ్ అధికారులకు అప్పగించింది.

సమావేశాల్లో తొలి ఎజెండాగా జీపీఎస్ఏపీ

గ్రామపంచాయతీ పాలకవర్గాల నెలవారీ సమావేశాల్లో జీపీఎస్ఏపీ పురోగతిపైనే మొదటి ఎజెండాగా చర్చించాలని ప్రభుత్వం ఆదేశించింది. సర్పంచ్ అధ్యక్షతన జరిగే సమీక్షలకు క్షేత్రస్థాయి ఉద్యోగులంతా తప్పనిసరిగా హాజరుకావాలి. కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ప్రణాళిక అమలును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పల్లెల అభివృద్ధిని పర్యవేక్షించాలి. ఈ విధానం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపాలను అధిగమించి, గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

వేగంగా రైలు కారిడార్లు

-మొదటిపేజీ తరువాయి

కొన్ని మార్పులను సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. కేంద్రం అలైన్‌మెంట్‌ను ఆమోదించిన వెంటనే భూసేకరణ ప్రారంభిస్తామని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త రైలు మార్గాలకు మంజూరు కోరుతూ..

వికారాబాద్--కృష్ణా కొత్త రైల్వే లైన్‌కు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని వివరించారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) చుట్టూ రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని అలైన్‌మెంట్ చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టుతో ప్రాంతీయ రవాణా మెరుగుపడటంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.

పలు బైపాస్ లైన్లకు ప్రతిపాదనలు

డోర్నకల్--గద్వాల, కల్వకుర్తి--మాచర్ల, కాచిగూడ--జగ్గయ్యపేట, పటాన్‌చెరు--ఆదిలాబాద్, బోధన్--లాతూర్, అక్కన్నపేట బైపాస్ రైల్వే లైన్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

మహబూబాబాద్ సమీపంలో డిపో ఏర్పాటు చేయాలి

దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేయనున్న మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిపో నిర్మాణానికి అవసరమైన 409.1 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు మరో బోనస్..

-మొదటిపేజీ తరువాయి

విశేషం. ఇటీవల దసరా బోనస్‌గా ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.54 లక్షల వరకు చెల్లించారు. ఇప్పుడు ప్రకటించిన దీపావళి బోనస్‌తో కలిపి, కేవలం రెండు పండుగలకు ఒక్కో కార్మికుడు సగటున/గరిష్ఠంగా రూ. 2.65 లక్షల వరకు ప్రయోజనం పొందనున్నారు. ఈ రెండు బోనస్‌ల కోసం సింగరేణి సంస్థ మొత్తంగా రూ. 1,020 కోట్లకు పైగా వెచ్చిస్తోంది. ఇది కార్మికుల పట్ల యాజమాన్యం నిబద్ధతను తెలియజేస్తోంది.



ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బోనస్ మొత్తాన్ని నవంబర్ 5వ తేదీన నేరుగా అర్హులైన కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి సంబంధిత విభాగాలను ఆదేశించారు. ఈ బోనస్ నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ (బీజఔూ) పరిధిలోని కార్మికులకు మాత్రమే వర్తిస్తుందని, అధికారులకు ఇది వర్తించదని యాజమాన్యం స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల్లో కనీసం 190 రోజులు, ఓపెన్‌కాస్ట్ గనులు లేదా సర్ఫేస్ విభాగాల్లో 240 రోజులు పనిచేసిన వారికి పూర్తి బోనస్ లభిస్తుంది. కనీసం 30 రోజులు పనిచేసిన వారికి, వారు పనిచేసిన దినాల నిష్పత్తి ప్రకారం బోనస్ చెల్లిస్తారు. ఒకదాని తర్వాత ఒకటిగా రెండు భారీ బోనస్‌లు ప్రకటించడంతో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం వారిలో పండుగ ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.

కమలంలో రాజకీయ కదలికలు



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీలో ఒక్కసారిగా రాజకీయ కదలికలు పెరగడం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహా కీలక నేతలు ఢిల్లీకి వెళ్లడం, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌లతో సమావేశం కానున్నారన్న సమాచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇంతకీ తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది? అధిష్టానం ఏదైనా కొత్త వ్యూహానికి పదును పెడుతోందా? రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసేందుకు ఈ సమావేశం వేదిక కానుందా?ఒక రాష్ట్రానికి చెందిన కీలక నేతలను పార్టీ అధిష్టానం అత్యవసరంగా ఢిల్లీకి పిలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటాల వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఈ సమావేశంపై ఆసక్తి మరింత పెరుగుతుంది.బండి సంజయ్‌కు కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతలు ఉండటంతోపాటు తెలంగాణ రాజకీయాల్లోనూ ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మరోవైపు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎంపీగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్వీ సుభాష్ వంటి పార్టీ ప్రతినిధులు కూడా ఈ చర్చల్లో పాల్గొనడం ద్వారా రాజకీయ అంశాలతోపాటు పార్టీ కార్యక్రమాలపై సమన్వయం జరిగే అవకాశం ఉంది.అయితే ఈ భేటీ వెనుక నిర్దిష్టంగా ఏ నిర్ణయం ఉందనే దానిపై అధికారిక ప్రకటన వెలువడే వరకు అంచనాలను వాస్తవాలుగా పరిగణించలేం. అయినప్పటికీ, రాష్ట్ర నేతలతో జాతీయ నాయకత్వం చర్చలు జరపడం ద్వారా తెలంగాణపై పార్టీ దృష్టి ఎలా ఉందో అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది.తెలంగాణలో బీజేపీ తన రాజకీయ విస్తరణ కోసం కేవలం రాష్ట్రస్థాయి సమావేశాలకే పరిమితం కాకుండా, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు గతంలో వెలువడిన నివేదికలు సూచిస్తున్నాయి. బూత్ కమిటీల బలోపేతం, జిల్లాల్లో పార్టీ కార్యకలాపాల విస్తరణ, స్థానిక నాయకులతో సమన్వయం వంటి అంశాలకు జాతీయ నాయకత్వం ప్రాధాన్యం ఇస్తోంది.ఈ వ్యూహం వెనుక ప్రధాన ఉద్దేశం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు భవిష్యత్తులో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయడంగా కనిపిస్తోంది. అయితే సంస్థాగతంగా పార్టీని విస్తరించడం ఒక అంశమైతే, ఆ బలాన్ని ఓట్ల రూపంలోకి మార్చుకోవడం మరో అంశం. అందుకు స్థానిక సమస్యలపై నిరంతరం స్పందించడం, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడం కీలకం కానుంది.తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్‌ను కూడా రాజకీయంగా ఎదుర్కోవాలన్న వ్యూహంపై బీజేపీ నాయకత్వం గతంలో చర్చించినట్లు వార్తలు వచ్చాయి. రెండు పార్టీలపై విమర్శలు చేయడంతోపాటు, ప్రజా సమస్యలను తమ రాజకీయ కార్యాచరణలో భాగం చేసుకోవాలని రాష్ట్ర నాయకత్వానికి సూచించినట్లు నివేదికలు వెల్లడించాయి.విద్యార్థుల సమస్యలు, రైతుల ఇబ్బందులు, ఉద్యోగుల డిమాండ్లు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై బీజేపీ ఎలాంటి కార్యాచరణ రూపొందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నిరసనలు ప్రకటించడం ఒక్కటే సరిపోదు. ఆయా సమస్యలపై నిరంతర పోరాటం చేయడంతోపాటు, వాటికి పరిష్కారాలు చూపించే ప్రయత్నం కూడా పార్టీకి అవసరం.తెలంగాణ బీజేపీకి మరో ముఖ్యమైన అంశం అంతర్గత సమన్వయం. రాష్ట్రంలో పార్టీని విస్తరించాలంటే కీలక నాయకులంతా ఒకే దిశలో పనిచేయాల్సి ఉంటుంది. నాయకుల మధ్య విభేదాలు, వేర్వేరు వర్గాలుగా పనిచేస్తున్నారనే ప్రచారం పార్టీ కార్యకర్తల్లో గందరగోళానికి దారితీయవచ్చని గతంలో వచ్చిన నివేదికలు పేర్కొన్నాయి.ఈ నేపథ్యంలో బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వంటి నేతలతో ఢిల్లీలో జరిగే సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. రాష్ట్రంలోని వివిధ నాయకుల అభిప్రాయాలను సమన్వయం చేయడం, బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించడం, పార్టీ కార్యక్రమాలకు ఒకే కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సమావేశంలో అంతర్గత విభేదాలపై చర్చ జరుగుతుందా, కొత్త బాధ్యతలు అప్పగిస్తారా అన్నది అధికారిక సమాచారం వెలువడితేనే స్పష్టమవుతుంది.తెలంగాణలో బీజేపీ తన రాజకీయ ప్రాధాన్యాన్ని పెంచుకోవాలంటే జాతీయ నాయకత్వం నుంచి వచ్చే ఆదేశాలతోపాటు రాష్ట్ర ప్రజల సమస్యలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాల్సి ఉంటుంది. స్థానిక ఎన్నికల్లో పోటీ, బూత్ స్థాయి నిర్మాణం, ప్రజా ఉద్యమాలు, నాయకుల మధ్య సమన్వయం.. ఈ నాలుగు అంశాలు పార్టీ భవిష్యత్ రాజకీయ ప్రణాళికలో కీలకంగా మారే అవకాశం ఉంది.అందుకే ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీ సమావేశంపై ఉంది. ఈ భేటీ సాధారణ సమీక్షకే పరిమితమవుతుందా? లేక తెలంగాణ బీజేపీ రాజకీయ కార్యాచరణలో కొత్త మార్పులకు నాంది పలుకుతుందా? అనేది సమావేశం అనంతరం వెలువడే ప్రకటనలు, ఆ తర్వాత రాష్ట్రంలో పార్టీ చేపట్టే కార్యక్రమాలను బట్టి అర్థమవుతుంది.మొత్తానికి తెలంగాణ బీజేపీలో ఏదో జరుగుతోందన్న ఆసక్తి వెనుక ప్రధాన ప్రశ్న ఒక్కటే ? అధిష్టానం రూపొందించే వ్యూహాన్ని రాష్ట్ర నాయకత్వం క్షేత్రస్థాయిలో ఎంత సమర్థంగా అమలు చేస్తుంది? దానికి సమాధానం ఢిల్లీ భేటీ తర్వాత పార్టీ తీసుకునే నిర్ణయాల్లోనే కనిపించనుంది.

రేషన్ బియ్యం స్కామ్ గుట్టురట్టు..
రీసైక్లింగ్ చేసి బ్రాండెడ్ పేరుతో విక్రయం

హైదరాబాద్ : హైదరాబాద్ పరిధిలో దర్జాగా సాగుతున్న భారీ రేషన్ బియ్యం మాఫియా అక్రమాలను సివిల్ సప్లైస్, విజిలెన్స్ చెక్ పెట్టాయి. పేదలకు ప్రభుత్వం అతి తక్కువ ధరకు లేదా ఉచితంగా సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని దళారులు అక్రమ మార్గాల్లో సేకరించి, వాటిని రీ-సైక్లింగ్ చేసి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. కర్మన్ ఘాట్ పరిసరాల్లోని ప్రముఖ రైస్ డిపోలు, గోదాములపై ఉన్నతాధికారులు దాడులు చేశారు. ఈ సోదాల్లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సంచులు, కల్తీ ప్రాసెసింగ్ యంత్రాలను అధికారులు సీజ్ చేశారు. రేషన్ లబ్ధిదారుల నుంచి లేదా రేషన్ డీలర్ల నుంచి అతి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని మాఫియా ఏజెంట్లు సేకరిస్తారు. ఇలా సేకరించిన లావు బియ్యాన్ని రైస్ మిల్లులు, డిపోల్లో ప్రత్యేక యంత్రాల ద్వారా పాలిష్ పట్టిస్తారు. దీనివల్ల బియ్యం తెల్లగా, సన్న బియ్యం మాదిరిగా కనిపిస్తాయి. రీ సైకిల్ చేసిన ఈ బియ్యాన్ని ప్రముఖ, పేరుగాంచిన బ్రాండెడ్ కంపెనీల కవర్లు, డూప్లికేట్ బ్యాగుల్లో ప్యాక్ చేస్తారు. మార్కెట్లో ఈ కల్తీ బియ్యాన్ని కిలో రూ. 80 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తూ వినియోగదారులను దారుణంగా మోసం చేస్తున్నారు.రేషన్ బియ్యాన్ని పదే పదే పాలిష్ చేయడం ద్వారా వాటిలో ఉండాల్సిన పోషకాలు కోల్పోతాయి. ప్రాసెసింగ్ సమయంలో వాడే రసాయనాల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేషన్ అక్రమ తరలింపునకు సహకరిస్తున్న డీలర్లు, మిల్లుల యజమానులు, దళారులపై పి.డి. యాక్ట్ కింద కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు జరగకుండా బయోమెట్రిక్ ట్రాకింగ్, జీపీఎస్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ తెలిపింది.

మన తొలివెలుగు

రాజకీయ మనుగడగా నిత్యావసరాలు


రాజకీయాల్లో ప్రభుత్వాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రగిలేందుకు పెద్ద పెద్ద సమస్యలో లేదా సిద్ధాంతపరమైన విభేదాలో అవసరం లేదు. సగటు సామాన్యుడి రోజువారీ కిచెన్ బడ్జెట్ తలకిందులైతే చాలు! కడుపు నిండా తినే కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటినప్పుడు, ప్రజల్లో వ్యక్తమయ్యే ఆగ్రహం నేరుగా పాలకపక్షాల గ్రాఫ్‌ను వేగంగా పడదోస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిన ఎల్ నినో తీవ్రత వల్ల ఏర్పడిన అకాల వర్షాలు, పండగల రద్దీ, వాతావరణ మార్పుల ధాటికి ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనూ నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ధరల మంట ప్రజావ్యతిరేకతగా మారకముందే అదుపుచేసేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు రూ.కోట్ల ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధపడుతుండటం ఆసక్తికరమైన రాజకీయ సమీకరణగా మారింది.ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, పెరుగుతున్న ధరల నుంచి సామాన్యుడిని కాపాడేందుకు ప్రత్యేక కౌంటర్లు, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో రంగంలోకి దించింది. నెలకు సుమారు రూ. 100 కోట్ల వరకు అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ, బహిరంగ మార్కెట్ ధరల కంటే చాలా తక్కువకే నిత్యావసరాలను అందుబాటులోకి తెస్తోంది. రూ.100కే కిలో కందిపప్పు, రూ.125కే లీటర్ పామాయిల్, రూ.25కే గోధుమపిండి అందించడంతో పాటు, ధరణి బ్రాండ్ బియ్యాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా అందుబాటులోకి తెస్తూ మార్కెట్ ధరలపై ఒత్తిడి పెంచి అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది.మరోవైపు తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల అసంతృప్తిని చల్లబరిచేందుకు ఏకంగా రేషన్ కార్డుదారులకు ప్రత్యేక నిత్యావసరాల కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టే దిశగా అడుగులు వేస్తోంది. కేవలం బియ్యం మాత్రమే కాకుండా, పప్పు దినుసులు, వంటనూనెలు, గోధుమపిండి, చక్కెర వంటి 6 రకాల నిత్యావసరాలతో కూడిన సబ్సిడీ కిట్లను అందించడం ద్వారా పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. బహిరంగ మార్కెట్లో ధరలను విచ్చలవిడిగా పెంచే వ్యాపారుల నిర్బంధ తనిఖీలతో పాటు, ప్రభుత్వం నేరుగా ఈ సబ్సిడీ కిట్లను ఇవ్వడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల్లో సానుకూలత తెచ్చుకోవాలని భావిస్తోంది.ఆర్థికంగా తీవ్ర లోటు, రుణభారంతో సతమతమవుతున్నప్పటికీ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణకై ఇంత భారీగా నిధులు వెచ్చించడానికి ప్రధాన కారణం ఓటు బ్యాంకు ముప్పు! ఉచిత పథకాలు ఎంత అందజేసినా, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగితే సామాన్యుడి పాకెట్ మనీ ఖాళీ అయిపోతుంది. దీనివల్ల ప్రభుత్వాల సంక్షేమ పథకాల ఇంపాక్ట్ సున్నాగా మారి, హామీలు ఇచ్చారు కానీ పొట్ట నింపడం లేదు అనే నిరసన స్వరం గ్రామాల్లో బలంగా వినిపించే ప్రమాదం ఉందనేది పొలిటికల్ సర్వేల హెచ్చరిక. ఈ నిత్యావసరాల ధరల నియంత్రణ అంశం రెండు ప్రభుత్వాలకు సంజీవనిలా మారనుంది. బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతరం నిఘా ఉంచడం, లభ్యత కొరత రాకుండా ముందస్తుగా దిగుమతులు చేసుకోవడం ద్వారా ప్రజాసంతోషాన్ని కాపాడుకోవడమే ఏపీ, తెలంగాణ సీఎంల ప్రధాన అజెండా.జాతీయ, అంతర్జాతీయ వాతావరణ మార్పుల వల్ల ఏర్పడిన నిత్యావసరాల కొరతను కేవలం పరిపాలనా సమస్య గా చూడకుండా, 'రాజకీయ మనుగడ' సమస్యగా భావించి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు భారాన్ని తమ భుజాన వేసుకోవడం రాజకీయంగా అత్యంత వ్యూహాత్మకమైన అడుగుగా భావించవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా

యువకెరటం జయకేతనం!



శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ తర్వాత మరో దేశమైన సెర్బియాలో సైతం యువతరం తడాఖా చూపింది. ఆగ్నేయ యూరోప్‌లో డాన్యూబ్, సావా నదుల సంగమస్థలమైన దాని రాజధాని నగరం బెల్‌గ్రేడ్ సోమవారం లక్షలమంది జనంతో ఉప్పొంగిపోయింది. ఒక నాయకుడంటూ లేకుండా, నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించుకోకుండా విద్యార్థులు ఏకమై నెలకొల్పిన స్టూడెంట్ లిస్ట్ పార్టీ 53.3 శాతం ఓట్లతో, 140 స్థానాల్లో జయభేరి మోగించటం ఆ విజయోత్సవానికి కారణం. 250 స్థానాలున్న పార్లమెంటుకు పన్నెండేళ్ల క్రితం అధికారంలోకొచ్చిన ప్రస్తుత అధ్యక్షుడు అలెక్సాండర్ వూచిచ్ ఆ పక్కనున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆదర్శంగా తీసుకుని రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారికి కుదరదు గనుక ప్రధానిగా తిరిగొద్దామని ఎత్తుగడ వేశారు. కానీ తన పొరుగునున్న హంగేరీ అధ్యక్షుడు విక్టర్ ఒర్బాన్‌కు ఏమైందో గమనించుకోలేదు. తన మాదిరే ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా, పారిశ్రామికరంగం వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయించిన ఒర్బాన్ పదహారేళ్ల అనంతరం మొన్న మే నెలలో పదవీచ్యుతుడయ్యారు. దాన్నుంచి వూచిచ్ ఏమీ నేర్చుకోలేదు సరిగదా... అవినీతి భూతాన్ని అదుపు చేద్దామన్న స్పృహ కూడా కొరవడింది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో యువతరం హింసామార్గానికి మళ్లింది. అధికార సౌధాలపై దాడులకు దిగింది. పాలకుల్ని తరిమికొట్టింది. కానీ సెర్బియా యువతరం ఇందుకు భిన్నం. ప్రభుత్వం ఎంత రెచ్చగొట్టినా శాంతియుత మార్గాన్ని వీడలేదు. అందుకే రెండేళ్లనుంచి ఉద్యమం నిలకడగా సాగింది. దాన్ని అణిచేయటానికి వూచిచ్ చేయని ప్రయత్నమంటూ లేదు. తుపాకుల ప్రయోగం మినహా చేయాల్సిందంతా చేశారు. రాత్రి వేళల్లో అరెస్టులు, లాఠీచార్జిలు, పెప్పర్ స్ప్రే ప్రయోగాలు, ఉద్యమవేదికల్ని హఠాత్తుగా నిషేధిత ప్రాంతాలుగా ప్రకటించటం వగైరాలన్నీ ఉపయోగించారు. మాఫియా ముఠాలను రంగంలోకి దించారు. చురుగ్గా పనిచేసే నేతల్ని బెదిరించటం, దౌర్జన్యానికి దిగటం, ప్రధాన నగరాల్లో ప్రభుత్వ భవనాల దరిదాపుల్లోకొచ్చే యువకుల్ని బెదర గొట్టడం, ఇళ్లకు వెళ్లి చంపేస్తామని బెదిరించటం ఈ ముఠాల పని. ఉద్యమ నేతలను విదేశీ శక్తుల కిరాయిమనుషులుగా అనుకూల మీడియా సాగించిన ప్రచారం... ఉద్యమ కారుల బంధుమిత్ర గణం ద్వారా జనానికి చేరే సమాచారం ముందు వీగిపోయింది. విద్యార్థులు స్టూడెంట్ లిస్ట్ నేతలుగా వెలిగిపోవాలనుకోలేదు. నిజానికి 250 మంది జాబితాలో ఒక్క విద్యార్థి కూడా లేదు. రైతుల్ని, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లను, నటుల్ని, ఒపేరా గాయకుల్ని, క్రీడాకారుల్ని, వైద్యరంగ నిపుణుల్ని అభ్యర్థులుగా ఎంపిక చేసు కున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పార్టీ నెలకొల్పాలా వద్దా అని ఊగిసలాడినా చివరకు వివిధ నగరాలు, పట్టణాల్లోని కూడళ్లలో తరచు చర్చావేదికలు నిర్వహిస్తూ వచ్చారు. అక్కడే విధానాలు ఖరారయ్యేవి. ఆ విధానాలే ఇప్పుడు విజయాన్నిచ్చాయి. అయితే వూచిచ్ ఇంత త్వరగా పదవినుంచి తప్పుకుంటారని వారనుకోలేదు. బహుశా ఇదే బెల్‌గ్రేడ్‌లో 1903లో తన పేరేగల రాజుపై సైన్యం తిరుగుబాటుచేసి ఆయన్ని కిటికీ నుంచి విసిరేయడం గుర్తొచ్చి ఉండాలి. సైన్యం బలంతో అధికారానికి అంటిపెట్టుకుంటే కష్టాలు చవిచూడాల్సి వస్తుందని వూచిచ్ సరిగానే అంచనా వేసుకున్నారు. ఇంతకూ ఓడింది బ్రెజిల్‌లో మాదిరే మితవాద, జాతీయవాద పక్షమైనా... నెగ్గిందెవరో చెప్పటం అంత సులభం కాదు. వారు ఉదారవాదులనీ, అమెరికా డీప్ స్టేట్ ఏజెంట్లనీ వూచిచ్ ప్రచారం చేశారు. అటు ట్రంప్‌కు సైతం అలాంటి ఆశ ఉంది. బెల్‌గ్రేడ్‌లో ట్రంప్ టవర్‌కు వూచిచ్ అనుమతించకపోవడం ఆయనకు ఆగ్రహం కలిగించింది. కానీ స్టూడెంట్ లిస్ట్ అంత తేలిగ్గా అమెరికాను అక్కున చేర్చుకునే రకం కాదు. వారు మౌలికంగా ప్రజాస్వామికవాదులు. జాతీయవాదం తమలో ఏం తక్కువలేదని ఉద్యమ సందర్భంలో చాటారు. యూరోప్ యూనియన్(ఈయూ)లో చేరతామంటూనే సెర్బియా రష్యా వైపు మొగ్గడం ఆ సంస్థకు నచ్చలేదు. స్టూడెంట్ లిస్ట్ పార్టీకి ఈయూపై ఆసక్తే లేదు. మొత్తానికి నిలకడగా, సూత్రబద్ధంగా పోరాడి సాధించిన విజయం పాలనలో ఎన్నెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

డీఏ బకాయిలు.. పెన్షన్‌కు ముప్పు



కరువు భత్యం అంటే ప్రభుత్వం ఉద్యోగికి అదనంగా ఇస్తున్న డబ్బు కాదు. ధరలు పెరిగినప్పుడు వేతనం కొనుగోలు శక్తి తగ్గకుండా కొంతమేర భర్తీ చేయాల్సిన హక్కు. అందుకే డీఏ ఉత్తర్వు వచ్చిన రోజు ఉద్యోగులు దాన్ని కొత్త ప్రయోజనంగా చూడరు. తనకు రావాల్సిన డబ్బు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తారు. ఆ ఎదురుచూపు నెలలుగా, ఏండ్లుగా సాగితే అది కేవలం నగదు కొరతగా మిగలదు. ముఖ్యంగా సీపీఎస్ ఉద్యోగికి ప్రతి ఆలస్యమూ అతని రిటైర్మెంట్ భద్రతపై కూడా ప్రభావం చూపుతుంది. ఉద్యోగం చేస్తున్న రోజుల్లో జీతం కనిపిస్తుంది. రేపటి పెన్షన్ కనిపించదు. కానీ ఆ కనిపించని భవిష్యత్తు కోసం ఈరోజే డబ్బు జమ కావాలి.

సీపీఎస్ ఉద్యోగి పరిస్థితి సున్నితమైంది. జీతం నుంచి ప్రతి నెలా చందా మినహాయించి పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (పీఆర్ఏఎన్) ఖాతాలో జమ చేస్తారు. ఆ డబ్బు మార్కెట్ ఆధారిత పెట్టుబడుల్లోకి వెళ్తుంది మార్కెట్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. పెరుగుతుంది, పడిపోతుంది. అందుకే సకాలంలో చందా జమ కావడం ఒక రకంగా క్రమబద్ధమైన పెట్టుబడి విధానంలా పనిచేస్తుంది. మార్కెట్ పడినప్పుడు అదే మొత్తంతో ఎక్కువ యూనిట్లు రావచ్చు. పెరిగినప్పుడు తక్కువ యూనిట్లు రావచ్చు. ఈ ఒడిదొడుకుల మధ్య క్రమంగా పెట్టుబడి కొనసాగడమే దీర్ఘకాలంలో దాని బలం. కానీ ప్రభుత్వం ఉద్యోగికి రావాల్సిన మొత్తాన్ని నెలల తరబడి ఆలస్యం చేసి, మార్కెట్ పరిస్థితులు మారిన తర్వాత జమ చేస్తే..ఆ పెట్టుబడికి దక్కాల్సిన సమయాన్ని మాత్రమే కాదు, ఆ సమయంలో లభించే అవకాశాన్ని కూడా ఉద్యోగి కోల్పోవచ్చు. ఒక చిన్న ఉదాహరణ ఈ నష్టాన్ని అర్థం చేసుకునేలా చేస్తుంది. రిటైర్మెంట్ ఖాతాలో రూ.50 వేలు సకాలంలో జమై, సగటున 8 శాతం వార్షిక రాబడి వచ్చిందని అనుకుంటే..20 ఏండ్లలో అది సుమారు రూ.2.33 లక్షలు అవుతుంది. అదే రూ.50 వేలు మూడేండ్లు ఆలస్యంగా జమైతే పెట్టుబడి కాలం 17 ఏండ్లకు తగ్గి సుమారు రూ.1.85 లక్షలే అవుతుంది. అంటే దాదాపు రూ.48 వేల తేడా. ఇది నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్పీఎస్)లో హామీ ఇచ్చిన రాబడి కాదు. కేవలం ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి తీసుకున్న ఉదాహరణ మాత్రమే. ఆలస్యమైన డబ్బు తర్వాత జమ చేయవచ్చు..కోల్పోయిన పెట్టుబడి సమయాన్ని మాత్రం తిరిగి జమ చేయలేం. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎన్పీఎస్‌పై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ (కాగ్), చందాలు సకాలంలో జమ కాకపోవడం వల్ల పెన్షన్ పొదుపుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాన్ని గుర్తించింది. ఉద్యోగి చందా ఆలస్యంగా పెట్టుబడిగా మారితే, ఆ మొత్తానికి దక్కాల్సిన పెట్టుబడి కాలం తగ్గుతుంది. అంటే చందా ఆలస్యం అనేది కేవలం లెక్కల్లో ఒక తేదీ మారడం కాదు.

రిటైర్మెంట్ నిధి పెరిగే అవకాశాన్నే తగ్గించడం. అందుకే చందాలు ఆలస్యమైతే ఉద్యోగికి నష్టం కలుగకుండా పరిహారం, వడ్డీ, బాధ్యుల జవాబుదారీతనం వంటి అంశాలను కేంద్ర నిబంధనలు కూడా ప్రస్తావించాయి. అయితే కరువు భత్యం (డీఏ) బకాయిల విషయంలోనూ ఇదే సూత్రాన్ని వర్తింపజేయాల్సిన అవసరం ఉన్నది. ఇక్కడే అసలు బాధ మొదలవుతుంది. ఇరవై, ముప్పై ఏండ్లు ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగులు రిటైర్ అయ్యే నాటికి తన జీవితానికి ఒక భరోసా ఉంటుందని ఆశిస్తారు. కానీ సీపీఎస్‌లో రిటైర్మెంట్ తర్వాత వచ్చే ఆదాయం ఎంత ఉంటుందన్నది ముందుగానే కచ్చితంగా చెప్పలేం. ఇప్పటికే కొందరు రిటైర్డ్ ఉద్యోగులు తమకు నెలకు నాలుగు, ఐదు వేల రూపాయల స్థాయిలోనే పెన్షన్ వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరి పరిస్థితి ఒకేలా ఉండకపోయినా, ఈ అనుభవం ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నది. ప్రభుత్వానికి ఇరవై, ముప్పై ఏండ్లు సేవ చేసిన తర్వాత కూడా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రతపై ఇంత అనిశ్చితి ఉంటే, ఉద్యోగికి తన భవిష్యత్తుపై భరోసా ఎలా ఉంటుంది? ప్రభుత్వం కూడా ఒక విషయాన్ని గుర్తించాలి. ఆర్థిక భారం తగ్గించుకోవడానికి డీఏ బకాయిలను విడతల్లో చెల్లించడం ఒక పరిపాలనా నిర్ణయం కావచ్చు. కానీ రిటైర్మెంట్ ఖాతాకు వెళ్లాల్సిన ఉద్యోగి, ప్రభుత్వ చందాలను మాత్రం ఆ విడతల కోసం ఆపకూడదు. డీఏ బకాయి విడుదలైన వెంటనే ఉద్యోగి వాటాతోపాటు ప్రభుత్వ వాటాను కూడా పీఆర్ఏఎన్ ఖాతాలో జమ చేయాలి. ప్రతి నెలా సాధారణ చందా కూడా నిర్ణీత గడువులో జమయ్యేలా ఆటోమేటిక్ వ్యవస్థ ఉండాలి. ఉద్యో గి తన డబ్బు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదు. అతని ఖాతాలో డబ్బు ఎప్పుడు జమైందో, ఎంత జమైందో స్పష్టంగా కనిపించేలా వ్యవస్థ ఉండాలి. ఉద్యోగి భవిష్యత్తు భద్రతకు సంబంధించిన డబ్బును 'తర్వాత చూద్దాం' అనే ఖాతాలో పెట్టలేం. ఒక డీఏలోని రూ.50 వేల రిటైర్మెంట్ భాగం మూడేండ్లు ఆలస్యమైతే పైన తెలిపిన ఉదాహరణ లెక్క ప్రకారం దాని భవిష్యత్తు విలువలో దాదాపు రూ.48 వేల తేడా కనిపిస్తున్నది. ఇంకా చెల్లించాల్సిన డీఏ బకాయిలు, భవిష్యత్తులో ఆలస్యమయ్యే చందాలు కూడా ఇదే విధంగా ప్రభావితం చేస్తే.. నష్టం ఒక్క ఉద్యోగికి మాత్రమే పరిమితం కాదు. ప్రజలకు సేవ చేయాల్సిన వ్యక్తి తన ఉద్యోగం గురించి, వృద్ధాప్యం గురించి ఆందోళన పడుతూ పనిచేయాల్సిన పరిస్థితి ఏ వ్యవస్థకూ మంచిది కాదు. ఉద్యోగి భవిష్యత్తుపై నమ్మకం కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. డీఏ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారనేదే కాదు..సీపీఎస్ ఉద్యోగికి రావాల్సిన మొత్తాన్ని ఎప్పుడు పీఆర్ఏఎన్ ఖాతాలో జమ చేస్తారన్నదీ ముఖ్యమే. 2030 ఏండ్లు ప్రభుత్వానికి సేవ చేసిన తర్వాత వృద్ధాప్యంలో భరోసా కోసం ఎదురుచూసే పరిస్థితి రాకూడదు. ఉద్యోగి జీవితమంతా చెల్లించిన చందాలు, రావాల్సిన బకాయిలు చివరికి అతని వృద్ధాప్యానికి అండగా నిలవాలి. డబ్బు ఆలస్యంగా ఇవ్వొచ్చు.. కానీ ఆ డబ్బు పెరగాల్సిన కాలాన్ని మళ్లీ ఇవ్వలేం.

భువనగిరిని కరువు మండలంగా ప్రకటించాలి

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి..
మూగజీవాలకు నీటి వసతి కల్పించాలి
సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ డిమాండ్

మన తొలివెలుగు । భువనగిరి రూరల్ ప్రతినిధి కే. నాగమణి । అక్టోబర్ 30, 2026 : భువనగిరి మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు పశువులు, గొర్రెలు, మేకలకు తాగునీరు, పశుగ్రాసం అందించాలని కోరారు. శుక్రవారం భువనగిరి మండలంలోని అనాజిపురం గ్రామంలో రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దయ్యాల నరసింహ మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కొరత కారణంగా సాగు చేసిన వరి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే బస్వాపురం రిజర్వాయర్ నుంచి వడపర్తి కత్వా మీదుగా భువనగిరి పెద్ద చెరువును నింపాలని సూచించారు. అదేవిధంగా అనాజిపురం చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకుంటే అనాజిపురంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బస్వాపురం రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే ఏర్పాట్లు చేయాలని, భువనగిరి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. వేసవికి ముందే గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, పశువులు, గొర్రెలు, మేకలకు



నీటి తొట్లు ఏర్పాటు చేయడంతో పాటు మేత, పశుగ్రాసం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎదునూరి మల్లేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు గునుగుంట్ల శ్రీనివాస్, అనాజిపురం సర్పంచ్ రాయపురం సురేష్, సీపీఎం గ్రామ కమిటీ కార్యదర్శి అబ్దుల్లాపురం వెంకటేష్, గ్రామ శాఖ కార్యదర్శి ఎదునూరి వెంకటేష్, ఎండీ షాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప.. భక్తి పారవశ్యంలో గౌలిపుర!

శబరిమల సన్నిధికి అయ్యప్ప స్వాముల పాదయాత్ర..
ఆధ్యాత్మిక నినాదాలతో మార్మోగిన పాతబస్తీ వీధులు







మన తొలివెలుగు । తెలంగాణ స్టేట్ బ్యూరో ప్రతినిధి -- సాయి కిషోర్ కనుగుల । అక్టోబర్ 30, 2026 : హరిహరసుతుడు అయ్యప్ప స్వామి నామస్మరణతో హైదరాబాద్ పాతబస్తీలోని గౌలిపురం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. శరణుఘోషల మధ్య వందలాది మంది అయ్యప్ప మాలధారులు శబరిమల క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. భక్తి, శ్రద్ధ, నియమనిష్ఠలకు ప్రతీకగా సాగిన ఈ ఆధ్యాత్మిక యాత్ర భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గౌలిపురలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం స్వాములు ఇరుముడులను తలపై ధరించి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. నల్లని వస్త్రధారణలో, మెడలో తులసి మాలలతో, అయ్యప్ప నామస్మరణ చేస్తూ స్వాములు ముందుకు సాగారు. 'స్వామియే శరణం అయ్యప్ప' అనే శరణుఘోషలతో గౌలిపురం వీధులన్నీ మార్మోగాయి. అయ్యప్ప స్వాముల పాదయాత్రకు స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ స్వాముల పాదయాత్రలో భక్తిశ్రద్ధలతో భాగస్వాములయ్యారు. అడుగడుగునా అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మండల పూజల సందర్భంగా గౌలిపుర నుంచి శబరిమలకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. అయ్యప్ప దీక్ష చేపట్టి కఠోర నియమాలను పాటిస్తూ స్వామి దర్శనం కోసం పయనమవుతున్న భక్తుల అచంచలమైన విశ్వాసం, భక్తిశ్రద్ధలు అభినందనీయమని పేర్కొన్నారు. పాదయాత్ర విజయవంతంగా, సజావుగా సాగేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అయ్యప్ప నామస్మరణతో.. శబరిగిరుల వైపు సాగిన ప్రతి అడుగు భక్తికి ప్రతిరూపంగా నిలిచింది.. స్వామియే శరణం అయ్యప్ప!

పట్టభద్రులారా.. ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోండి

అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి



మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య । అక్టోబర్ 30, 2026 : రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని దావూద్ గూడ ఉప సర్పంచ్ ఆర్. తేజ నాయక్ కోరారు. 2023 నవంబర్ 1 నాటికి లేదా అంతకుముందే డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. అర్హులు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, డిగ్రీ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు అవసరమైన వివరాలు సమర్పించాలని సూచించారు. గతంలో ఓటు వేసిన వారు సైతం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు నవంబర్ 6తో ముగియనున్నందున చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. కందుకూరు మండలంలోని అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పట్టభద్రులారా.. ఓటరుగా నమోదు చేసుకోండి!

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకం.. అర్హులందరూ నమోదు చేసుకోవాలి: సర్పంచ్ నవీన్ గౌడ్



మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య । అక్టోబర్ 30, 2026 : మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని మహేశ్వరం గ్రామ సర్పంచ్ నవీన్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యతతో కూడిన హక్కు అని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మహేశ్వరంలో బీఆర్ఎస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో నవీన్ గౌడ్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఓటరు నమోదును నిర్లక్ష్యం చేయకుండా, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేవలం తాము నమోదు చేసుకోవడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో పాటు పరిసర ప్రాంతాల్లోని అర్హులైన పట్టభద్రులకు కూడా ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో మరింత చురుగ్గా భాగస్వాములు కావచ్చని ఆయన అన్నారు. అర్హులైన ఒక్క పట్టభద్రుడు కూడా ఓటు హక్కును కోల్పోకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ స్వర్ణ గంటి ఆనందం, ఉపసర్పంచ్ జోరల రమేష్, వార్డు సభ్యుడు వీరి బాబు, పీఏసీఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్, హనుమంతు నాయక్, సున్నం కృష్ణ, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కటికల మహేందర్, మిదింటి సురేష్, తెల్జేరి శ్రీశైలం, దయానంద గౌడ్, మిదింటి సిద్ధు, టీంగిరికారి నరేష్, ఆనగోని అనిల్ గౌడ్, మహేష్ బాబు, బి. శ్రీకర్, రోహిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల.. భవిష్యత్తుకు భరోసా

అలాంటి పిల్లలను ముందుగానే గుర్తించి తగిన సహాయం అందించాలి
వాజేడులో 'ప్రశస్తి 2.0' అవగాహన సదస్సు విజయవంతం





మన తొలివెలుగు । వాజేడు ప్రతినిధి: వై. సర్వేశ్వరరావు । అక్టోబర్ 30, 2026 : ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన ప్రత్యేక శ్రద్ధ, సహాయక బోధన అందించడమే లక్ష్యంగా వాజేడు మండల కేంద్రంలోని నాగారం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి 'ప్రశస్తి 2.0' ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి, వారికి విద్యాపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గుర్తింపు ప్రక్రియను బాధ్యతాయుతంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సయ్యద్ అలీముద్దీన్ ఖాద్రి, మోడెం లక్ష్మి, దుర్గానంద్ నిపుణులుగా వ్యవహరించారు. 3 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో 21 రకాల వైకల్యాలకు సంబంధించిన లక్షణాలను 61 ప్రశ్నల ఆధారంగా ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు గుర్తించే విధానాన్ని వివరించారు. ప్రశస్తి 2.0 ద్వారా పిల్లల్లోని ప్రత్యేక అవసరాలను తొలిదశలోనే గుర్తించి, సకాలంలో ప్రత్యేక శ్రద్ధ, సహాయక బోధన, అవసరమైన చికిత్స, థెరపీ అందించడంతో పాటు, అర్హులైన వారికి ప్రత్యేక గుర్తింపు కార్డు (యు.డి.ఐ.డి.) పొందేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో వాజేడు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించిన సీనియర్ సివిల్ జడ్జి శాలిని

బాలల రక్షణకు చట్టాలపై అవగాహన అవసరం.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ప్రత్యేక వివరణ



మన తొలివెలుగు । తెలంగాణ స్టేట్ బ్యూరో -- సాయి కిషోర్ కనుగుల । అక్టోబర్ 30, 2026 : అరోరా లీగల్ సైన్సెస్ అకాడమీ ఆధ్వర్యంలో శంషీర్‌గంజ్‌లోని శారదా విద్యాలయ పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. శాలిని విద్యార్థులకు బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, హక్కులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులపై జరుగుతున్న లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాలను వివరించి, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. బాలల రక్షణ కోసం అందుబాటులో ఉన్న చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 గురించి వివరించారు. పిల్లల భద్రతకు చట్టాలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని, అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు జడ్జి శాలిని సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరోరా లీగల్ సైన్సెస్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ డాలీ గౌతమ్, శారదా విద్యాలయ పాఠశాల ప్రిన్సిపాల్ టి. సీమా, అరోరా లీగల్ సైన్సెస్ అకాడమీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి
సర్పంచ్ మునిగంటి స్వప్న



మన తొలివెలుగు । సైదాపూర్ మండలం ప్రతినిధి శ్రీనివాస్ । అక్టోబర్ 30, 2026 : పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రత్యేక అవగాహన సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. సైదాపూర్ గ్రామ సర్పంచ్ మునిగంటి స్వప్న సంతోష్ అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శి సారయ్య, జీపీఓ స్వప్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మునిగంటి స్వప్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కుల, మత, వర్గ, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సమాజంలో అంటరానితనం, కులవివక్ష వంటి అసమానతలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, ఐకమత్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకొని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్ పి. లక్ష్మణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి. వినోద్ కుమార్, ఇన్‌చార్జి ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ పి. లాకేందర్, ఐకేపీ సీసీ దేవేందర్‌లు పౌర హక్కులు, రాజ్యాంగం కల్పించిన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపగాని నవీన్ కుమార్, వార్డు సభ్యులు పొడిశెట్టి అరుణ్ కుమార్, బోనగిరి వెంకటలక్ష్మి, వంగ తిరుమలేష్, కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి యాదగిరి, మునిగంటి సంతోష్, కాలనీ వాసులు గొల్లపల్లి రాజయ్య, బండారి శ్రీనివాస్, ముజ్జిగ పద్మయ్య, నీర్ల వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ భూ సమస్యలపై సమరభేరి.. భారీ ధర్నాకు పిలుపు!

పీసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.. గ్రామసభల అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దు: ఎట్టి విద్యాసాగర్



మన తొలివెలుగు । వాజేడు ప్రతినిధి వై. సర్వేశ్వరరావు । అక్టోబర్ 30, 2026 : ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని, ఆదివాసీల హక్కులకు రక్షణ కల్పించే పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో భారీ ధర్నాకు పిలుపునిచ్చారు. సోమవారం వెంకటాపురం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట భూ సమస్యలు, ఏజెన్సీ చట్టాల అమలుపై ధర్నా నిర్వహించనున్నట్లు ఆదివాసి నవనిర్మాణ సేన ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ వెల్లడించారు. వాజేడు మండల కేంద్రంలో సమాచార ప్రసార ప్రతినిధి పాయం అజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా చట్ట నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా పీసా గ్రామసభలు నిర్వహించాలని, గ్రామసభల అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా గిరిజనేతరులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలంటే ముందుగా నిబంధనల ప్రకారం గ్రామసభ అనుమతి పొందాలని, అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా చట్టాన్ని ఉల్లంఘించే వారిపై రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీల భూములు, హక్కులు, గ్రామసభల అధికారాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. చట్టాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే ఆదివాసీల హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వెంకటాపురం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనులంతా అధిక సంఖ్యలో తరలివచ్చి ఐక్యంగా తమ హక్కుల కోసం గొంతెత్తాలని ఎట్టి విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆదివాసి నవనిర్మాణ సేన రాష్ట్ర సమాచార ప్రసార ప్రతినిధి పాయం అజయ్, మండల కార్యదర్శి యలం అశోక్, నాయకులు పర్నిక రామకృష్ణ, ముడెం బాబురావు, మడప పగిడయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద కూలీల పొట్టకొట్టి.. కాగితాలపై ఉపాధి!

పని చేయకుండానే ఫొటోలు అప్‌లోడ్.. వేతనాల్లో కోతలంటూ ఆరోపణలు
ద్యాగదొడ్డిలో ఉపాధి హామీ పథకం అమలుపై అనుమానాలు



మన తొలివెలుగు । జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి గడ్డం సుధాకర్ । అక్టోబర్ 31, 2026 : రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలు.. రోజంతా ఎండలో చెమటోడ్చితేనే ఇంట్లో పొయ్యి వెలిగే కూలీలు. పిల్లల ఆకలి తీర్చుకోవడానికి, కుటుంబాన్ని పోషించుకోవడానికి ఉపాధి పనులపై ఆధారపడే పేదలకు భరోసా కావాల్సిన పథకమే అక్రమాలకు వేదికగా మారుతోందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గద్వాల జిల్లా ధరూర్ మండలం ద్యాగదొడ్డి గ్రామంలో ఉపాధి హామీ పథకం అమలుపై గ్రామస్థులు పలు ఆరోపణలు చేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ బంటు అంజనేయులు వ్యవహారశైలిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కూలీలు పనులకు హాజరుకాకపోయినా పనిచేసినట్లు ఫొటోలు అప్‌లోడ్ చేసి బిల్లులు నమోదు చేస్తున్నారని, కూలీలకు రావాల్సిన వేతనాల్లోనూ కొంత మొత్తం తీసుకుంటున్నారని ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. రోజంతా కష్టపడే పేద కూలీకి దక్కాల్సిన ప్రతి రూపాయి వారి కుటుంబానికి ఎంతో విలువైనది. ఆ డబ్బుతోనే పిల్లలకు అన్నం పెట్టాలి.. చదివించాలి.. అనారోగ్యానికి మందులు కొనాలి. అలాంటి పేదల కష్టార్జితంలో కోతలు పడుతున్నాయనే ఆరోపణలు రావడం బాధాకరం. కూలీల పేర్లు రికార్డుల్లో ఉండటం కాదు.. వారి ఇళ్లలో ఆకలి తీరడం ముఖ్యం. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తక్షణమే స్పందించి మస్టర్ రోల్స్, హాజరు ఫొటోలు, పనుల వివరాలు, వేతనాల చెల్లింపులపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుని కూలీలకు న్యాయం చేయాలి. పేదవాడి చెమట చుక్కకు విలువ లేకపోతే.. ఉపాధి హామీ పథకానికి అర్థమేమిటి? కూలీల ఆకలిని తీర్చాల్సిన నిధులు పక్కదారి పట్టకుండా అధికారులు ఇప్పటికైనా మేల్కొంటారా?

ఎల్‌నినో ముప్పు తెలిసినా.. ప్రభుత్వ నిర్లక్ష్యం!

12.6 శాతం వర్షాభావంతో తాగునీటి కష్టాలు
ట్యాంకర్ మాఫియా దోపిడీపై బీఆర్ఎస్ నేత సలావుద్దీన్ లోధి ఆగ్రహం



మన తొలివెలుగు । తెలంగాణ బ్యూరో ప్రతినిధి సాయి కిషోర్ కనుగుల । అక్టోబర్ 30,2026 : ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని మే నెలలోనే వాతావరణ సంస్థలు హెచ్చరించినా ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ నేత సలావుద్దీన్ లోధి విమర్శించారు. 12.6 శాతం వర్షాభావంతో ప్రజలు తీవ్ర నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని, హైదరాబాద్ పాతబస్తీలో నల్లా నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు క్యాన్లు, ట్యాంకర్లపై ఆధారపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 లీటర్ల నీటి క్యాన్ రూ.50, ఐదు వేల లీటర్ల ట్యాంకర్ రూ. 2 వేలకు చేరడంతో పేదలపై అదనపు భారం పడుతోందన్నారు. నీటి కొరతను ఆసరాగా చేసుకుని ట్యాంకర్ మాఫియా దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఎండల తీవ్రత దృష్ట్యా చలివేంద్రాలు, కూలింగ్ సెంటర్లు, ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే తాగునీరు, రైతులకు పరిహారం, ఉపాధి అవకాశాలపై కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

రోడ్లను శుభ్రం చేసే చేతులనే.. రక్తపు మడుగులోకి నెట్టిన కారు!

విధి నిర్వహణలోనే పారిశుద్ధ్య కార్మికురాలి ప్రాణాలు బలి

మరో మహిళకు తీవ్ర గాయాలు

రెక్కలు ముక్కలు చేసుకుని బతుకుబండి లాగే కార్మికుల ప్రాణాలకు రక్షణేది?

మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య । అక్టోబర్ 30, 2026: తెల్లవారితే చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేసే చేతులు.. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా కనిపించాలని ఎండనక, వాననక శ్రమించే ఆ ప్రాణాలే చివరకు రక్తపు మడుగులో తడిశాయి. కుటుంబాన్ని పోషించుకోవాలనే బాధ్యతతో విధులకు హాజరైన ఓ పారిశుద్ధ్య కార్మికురాలిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. తాను శుభ్రం చేసే అదే రహదారిపై విగతజీవిగా పడి ఉండటం చూపరులను కలచివేసింది. రెక్కలు ముక్కలు చేసుకుని జీవనం సాగించే ఓ మహిళా కార్మికురాలి జీవితాన్ని ఒక్క కారు ప్రమాదం అర్ధంతరంగా ముగించింది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్-14 పరిసరాల్లో శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న ఈ విషాద ఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలం న్యాంతాపూర్ గ్రామానికి చెందిన ఓర్పు సరస్వతి (56) ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్-14 పరిసర ప్రాంతాల్లో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తోంది. రోజువారీ పనిలో భాగంగా శుక్రవారం ఉదయం రోడ్డు పరిసరాలను శుభ్రం చేస్తుండగా, ఉదయం 10:30 గంటల సమయంలో గుర్తుతెలియని కారు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ఆమెను ఢీకొట్టాడు. కారు ఢీకొట్టిన ధాటికి సరస్వతి ఎగిరి రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్ర గాయమై, రక్తస్రావంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. అదే గ్రామానికి చెందిన వరికుప్పల చంద్రమ్మ (60) కూడా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కుటుంబం కోసం వెళ్లిన కార్మికురాలు.. తిరిగిరాని లోకాలకు!

ఉదయం ఇంటి నుంచి పనికి బయలుదేరిన సరస్వతి.. విధులు ముగించుకుని తిరిగి వస్తుందని ఎదురుచూసిన కుటుంబ సభ్యులకు ఆమె మరణవార్త తీరని విషాదాన్ని మిగిల్చింది. రోజంతా కష్టపడితేనే కుటుంబానికి పూట గడిచే పరిస్థితుల్లో జీవనం సాగించే కార్మికుల జీవితాలు ఎంతటి ప్రమాదంలో ఉన్నాయో ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. ప్రజల కోసం రోడ్లను శుభ్రం చేసే కార్మికుల ప్రాణాలకు మాత్రం రహదారులపై భద్రత కరువవడం ఆందోళన కలిగిస్తోంది.

కార్మికుల భద్రతకు బాధ్యత ఎవరిది?

ప్రధాన రహదారులు, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు తగిన రక్షణ పరికరాలు, హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు కల్పించాల్సిన అవసరం ఉంది. విధి నిర్వహణలో కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సరస్వతి మృతి మరో కుటుంబానికి తీరని శోకాన్ని మిగల్చడమే కాకుండా, పారిశుద్ధ్య కార్మికుల భద్రతపై సమాజం, అధికార యంత్రాంగం ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రూ.300 కోట్ల భూముల కోసం పీటీ రైతుల పోరాటం

హక్కులు ఉన్నా.. న్యాయం ఎందుకు కరువు..!

ఎమ్మార్వో నివేదికల్లో వైరుధ్యాలపై సమగ్ర విచారణ జరపాలి

వివాదాస్పద లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దు

రైతుల విజ్ఞప్తి

మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య । అక్టోబర్ 30, 2026 : తరతరాలుగా తమ హక్కులో ఉన్న భూములను కాపాడుకునేందుకు పీటీ రైతులు చేస్తున్న పోరాటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామంలోని సర్వే నంబర్లు 371, 372, 377లో ఉన్న ప్రొటెక్టెడ్ టెనెన్సీ (పీటీ) భూముల విలువ సుమారు రూ.300 కోట్లు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. తమకు అనుకూలంగా పాత రెవెన్యూ రికార్డులు ఉన్నప్పటికీ, కొందరు అధికారులు తప్పుడు నివేదికలు రూపొందించి తమకు అన్యాయం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివేదికల్లో వైరుధ్యాలపై అనుమానాలు

గతంలో ఎమ్మార్వో కార్యాలయం సమర్పించిన నివేదికలకు, అనంతరం రూపొందించిన మరో నివేదికకు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అసలు రికార్డులను పరిగణనలోకి తీసుకోకుండా తమ హక్కులకు భంగం కలిగించేలా నివేదికలు రూపొందించారని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒకే భూమిపై భిన్న నివేదికలు ఎలా వచ్చాయో, వాటి తయారీకి ఏ రికార్డులను ప్రామాణికంగా తీసుకున్నారో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రైవేటు సంస్థలపై రైతుల ఆరోపణలు

జేబీ ఇన్‌ఫ్రా, కాంక్రీట్ ఇన్‌ఫ్రా, భువన్ ఇన్‌ఫ్రా సంస్థల ద్వారా తమ పీటీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో తప్పుడు నివేదికలు రూపొందించి లేఅవుట్ అనుమతులు పొందారని ఫిర్యాదు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని కోరుతున్నారు.

రంగంలోకి రాష్ట్ర విజిలెన్స్ కమిటీ

రైతుల ఫిర్యాదుల మేరకు రాష్ట్ర విజిలెన్స్ కమిటీ మహేశ్వరం ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించింది. అనంతరం రెవెన్యూ అధికారులతో కలిసి వివాదాస్పద భూములను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసింది. పాత పీటీ రికార్డులు, పహాణీలు, గత నివేదికలు, ప్రస్తుత నివేదికలు, లేఅవుట్ అనుమతులను సమగ్రంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు సమాచారం.

ప్లాట్లు కొనుగోలు చేయవద్దని హెచ్చరిక

వివాదాస్పద భూముల్లో జేబీ ఇన్‌ఫ్రా, భువన్ ఇన్‌ఫ్రా పేర్లతో ప్రచారంలో ఉన్న సంబంధిత లేఅవుట్లలో హక్కులు, అనుమతులపై స్పష్టత వచ్చే వరకు ప్లాట్లు కొనుగోలు చేయవద్దని పీటీ రైతులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. జీవితకాల సంపాదనను పెట్టుబడిగా పెట్టే ముందు భూముల అసలు యాజమాన్య పత్రాలు, రెవెన్యూ రికార్డులు, పీటీ హక్కులు, లేఅవుట్ అనుమతులను పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు.

రైతులకు న్యాయం చేయాలి

సుమారు రూ.300 కోట్ల విలువైనట్లు చెబుతున్న భూముల వివాదంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు. ఎమ్మార్వో నివేదికల్లోని వైరుధ్యాలపై విచారణ జరిపి, భూముల అసలు హక్కుదారులను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల హక్కులకు భంగం కలగకుండా రక్షణ కల్పించడంతో పాటు, విచారణలో తప్పులు చేసినట్లు తేలిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వెయ్యి కొట్టు.. నకిలీ ఆధార్, పాన్ కార్డులు పట్టు!

జిరాక్స్ సెంటర్ ముసుగులో క్రిమినల్ దందా.. గుర్తింపు కార్డులే టార్గెట్!

ఫొటోలు, పేర్లు, పుట్టిన తేదీలు, చిరునామాల మార్పులు.. ఒక్కో మార్పునకు ఒక్కో రేటు

60 ఆధార్ కార్డులు, 2 పాన్ కార్డులు స్వాధీనం.. ల్యాప్‌టాప్, ప్రింటర్‌తో నిందితుడి అరెస్ట్

మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య । అక్టోబర్ 30, 2026 : చేతిలో కంప్యూటర్.. ముందు జిరాక్స్ మెషిన్.. బయట ఆన్‌లైన్ సర్వీసెస్ బోర్డు! కానీ లోపల సాగుతున్నది మాత్రం గుర్తింపు కార్డుల అక్రమ దందా! ఆధార్, పాన్ కార్డులే లక్ష్యంగా పెట్టుకుని ఫొటోలు, పేర్లు, పుట్టిన తేదీలు, చిరునామాలను ఇష్టానుసారంగా మార్చేస్తూ అక్రమ సంపాదనకు తెరలేపిన వ్యక్తి వ్యవహారం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపుతోంది. రూ.300 నుంచి రూ.1,000 వరకు తీసుకుంటూ నకిలీ గుర్తింపు పత్రాలు తయారు చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడిని శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జల్‌పల్లి సర్కిల్ పరిధిలోని శ్రీరామ కాలనీకి చెందిన చింతల మహదేవ్ (36) ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. 'కవిత ఏ టు జెడ్ ఆన్‌లైన్ సర్వీసెస్' పేరుతో జిరాక్స్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. సాధారణ ఆన్‌లైన్ సేవల ముసుగులో తన వద్దకు వచ్చే వారికి ఆధార్, పాన్ కార్డుల్లోని కీలక వివరాలను అక్రమంగా మార్చి ఇచ్చే వ్యవహారానికి పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తూ ఫొటోలు, పేర్లు, పుట్టిన తేదీలు, చిరునామాలను మార్చి గుర్తింపు పత్రాలను తయారు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. బయటకు సాధారణ జిరాక్స్ సెంటర్‌లా కనిపించినా.. లోపల మాత్రం అక్రమ గుర్తింపు పత్రాల తయారీ సాగినట్లు పోలీసులు తెలిపారు.

పుట్టిన తేదీకి రూ.300.. పూర్తి మార్పులకు రూ.1,000!

ఈ దందాకు ప్రత్యేకంగా ధరల పట్టికే ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ మార్చేందుకు రూ.300, పూర్తి వివరాలను మార్చేందుకు రూ.700 నుంచి రూ.1,000 వరకు వసూలు చేసేవాడని తెలిపారు. అంటే డబ్బులు చెల్లిస్తే చాలు.. ప్రభుత్వ గుర్తింపు పత్రాల్లోని వివరాలనే మార్చి ఇచ్చే స్థాయికి ఈ అక్రమ వ్యవహారం చేరినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.

నకిలీ కార్డులతో మరో అడుగు.. ఎక్కడెక్కడ వినియోగం?

ఈ వ్యవహారంలో అసలు క్రైమ్ యాంగిల్ ఇక్కడే మొదలవుతోంది. మార్పులు చేసిన గుర్తింపు పత్రాలను కొందరు వ్యక్తులు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల్లో ప్రైవేట్ ఉద్యోగాలు పొందేందుకు, మొబైల్ సిమ్ కార్డులు తీసుకునేందుకు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు వినియోగించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఈ నకిలీ కార్డుల దందా వెనుక కేవలం డబ్బు సంపాదనే లక్ష్యమా? లేక మరిన్ని అక్రమాలకు ఇవి మార్గంగా మారాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పక్కా సమాచారంతో మెరుపు దాడి.. 60 కార్డులు స్వాధీనం!

నకిలీ గుర్తింపు కార్డుల తయారీపై విశ్వసనీయ సమాచారం అందుకున్న శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్, పహాడీషరీఫ్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి మహదేవ్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 60 నకిలీ లేదా మార్పులు చేసిన ఆధార్ కార్డులు, రెండు పాన్ కార్డులు, ల్యాప్‌టాప్, ప్రింటర్, లామినేషన్ మెషిన్, మొబైల్ ఫోన్, రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

60 కార్డుల వెనుక ఎంతమంది?

ఒక వ్యక్తి వద్ద ఏకంగా 60 ఆధార్ కార్డులు, రెండు పాన్ కార్డులు లభించడం ఈ వ్యవహారం తీవ్రతను సూచిస్తోంది. ఈ కార్డులను ఎవరెవరు తయారు చేయించుకున్నారు? వాటిని ఎక్కడెక్కడ వినియోగించారు? ఎంతమంది అక్రమంగా ప్రయోజనాలు పొందారు? ఈ దందాలో మధ్యవర్తుల పాత్ర ఏమైనా ఉందా? మరిన్ని ప్రాంతాలకు ఈ నెట్‌వర్క్ విస్తరించిందా? అనే ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తులో సమాధానాలు రావాల్సి ఉంది.

గుర్తింపు వ్యవస్థకే ముప్పు!

ఆధార్, పాన్ కార్డుల్లోని వివరాలు అక్రమంగా మార్చడం అనేది సాధారణ మోసం కాదు. ఒకరి గుర్తింపును మరొకరు ఉపయోగించుకోవడం, తప్పుడు వివరాలతో సేవలు పొందడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల దుర్వినియోగం, అక్రమ సిమ్ కార్డుల వినియోగం వంటి పరిణామాలకు ఇది దారితీసే ప్రమాదం ఉంది. అందుకే ఈ కేసులో నిందితుడి అరెస్టుతోనే దర్యాప్తు ఆగకుండా, నకిలీ పత్రాలను వినియోగించిన వ్యక్తుల వరకు విచారణ సాగాల్సిన అవసరం ఉంది. ఈ ఆపరేషన్‌లో శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి. కృష్ణమోహన్, ఎస్ఐలు ఎన్. శేషు, కె. మన్సూర్ అలీ, ఎన్. నర్సింహారావు, షాద్‌నగర్ జోన్ టాస్క్‌ఫోర్స్, పహాడీషరీఫ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వెయ్యి రూపాయల అక్రమ సంపాదన కోసం ఆధార్, పాన్ వంటి కీలక పత్రాలనే తారుమారు చేసిన ఈ వ్యవహారంలో.. తెర వెనుక ఉన్నవారెవరు? నకిలీ కార్డుల లబ్ధిదారులెందరు? అన్నది తేలాల్సి ఉంది.



అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూల షెడ్యూల్ విడుదల

తాడ్వాయి, వెంకటాపురం ప్రాజెక్టుల్లో 135 పోస్టుల భర్తీకి కసరత్తు

నవంబర్ 4 నుంచి ఇంటర్వ్యూలు



మన తొలివెలుగు । వాజేడు ప్రతినిధి వై. సర్వేశ్వరరావు । అక్టోబర్ 30, 2026 : ములుగు జిల్లాలో అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా తాడ్వాయి, వెంకటాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 135 పోస్టులకు ఇంటర్వ్యూల షెడ్యూల్ విడుదలైంది. ఇందులో 31 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 104 హెల్పర్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి నవంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు ములుగు ఐడీవోసీలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి ప్రేమల వెల్లడించారు. సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం అర్హులుగా గుర్తించిన అభ్యర్థులు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని అధికారులు స్పష్టం చేశారు. అర్హుల జాబితాలను సంబంధిత మండల పంచాయతీ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, సీడీపీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఇంటర్వ్యూల తేదీలు:

నవంబర్ 4న -- తాడ్వాయి ప్రాజెక్టు టీచర్ పోస్టులు. నవంబర్ 5న -- వెంకటాపురం ప్రాజెక్టు టీచర్ పోస్టులు. నవంబర్ 6న -- తాడ్వాయి ప్రాజెక్టు హెల్పర్ పోస్టులు. నవంబర్ 7న -- వెంకటాపురం ప్రాజెక్టు హెల్పర్ పోస్టులు. అర్హత సాధించిన అభ్యర్థులు తమకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో కేటాయించిన తేదీన నిర్దిష్ట సమయానికి ములుగు ఐడీవోసీలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని డీడబ్ల్యూవో ప్రేమల సూచించారు.

రాహుల్ పిలుపుతో ఢిల్లీకి గోషామహల్ కాంగ్రెస్ శ్రేణులు

రాంలీలా మార్చ్‌కు 10 మంది నాయకుల బృందం తరలింపు



మన తొలివెలుగు । తెలంగాణ స్టేట్ బ్యూరో -- సాయి కిషోర్ కనుగుల । అక్టోబర్ 30: నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న 'ఛలో ఢిల్లీ -- రాంలీలా మార్చ్' కార్యక్రమానికి గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బద్దం సతీష్ గౌడ్, ఇఫ్తేఖార్ అలీ ఆధ్వర్యంలో పది మంది సభ్యుల బృందం శుక్రవారం నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయలుదేరింది. ఈ సందర్భంగా బద్దం సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీ మార్చ్‌లో పాల్గొని విజయవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఏజెన్సీ గ్రామపంచాయతీల జోలికొస్తే సహించేది లేదు

రాజకీయ నాయకుల పెత్తనాన్ని అడ్డుకోవాలి

ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కట్టుబడాలి

జీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనేం సాయి దొర



మన తొలివెలుగు । వాజేడు ప్రతినిధి వై. సర్వేశ్వరరావు । అక్టోబర్ 30, 2026 : ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామపంచాయతీల నిధులపై రాజకీయ నాయకులు పెత్తనం చెలాయిస్తూ, అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తే సహించేది లేదని గొండ్వాన సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనేం సాయి దొర హెచ్చరించారు. వెంకటాపురం మండలం కమ్మరిగూడెం గ్రామంలో జీఎస్పీ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనేం ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల తరపున సర్పంచులుగా గెలిచిన ఆదివాసీ ప్రజాప్రతినిధులు గెలుపు తర్వాత పార్టీ నాయకుల పెత్తనానికి లొంగకుండా గ్రామపంచాయతీల అభివృద్ధికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామపంచాయతీల నిధుల వినియోగం, అభివృద్ధి పనుల్లో రాజకీయ నాయకుల జోక్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఆదివాసీ గ్రామాల ప్రయోజనాల కోసం ప్రజాప్రతినిధులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి రాజకీయ పార్టీలు అడ్డంకిగా మారితే ఆదివాసీలు ఐక్యంగా ఎదుర్కోవాలని, రాజకీయ పార్టీలను బహిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో కృష్ణార్జునరావు, ప్రసాద్, విజయ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ బాట పట్టిన సబితమ్మ.. సమస్యలపై స్పాట్‌లోనే యాక్షన్!

తాగునీటి సమస్యకు వారం రోజుల్లో పరిష్కారం.. డ్రైనేజీ పనులకు ఆదేశాలు

20 రోజుల్లో మళ్లీ వస్తా.. పనుల పురోగతి పరిశీలిస్తా: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య । అక్టోబర్ 30, 2026 : మహేశ్వరం నియోజకవర్గంలోని ఎన్టీఆర్ నగర్ ఫేజ్-2, సాయిబాబా నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం చంద్రు నాయక్‌తో మాట్లాడి వారం రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ ఈఈ కార్తీక్‌కు ఫోన్ చేసి సుమారు 20 మీటర్ల మేర డ్రైనేజీ పైప్‌లైన్ సామర్థ్యం పెంచి సమీప నాలాకు అనుసంధానం చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, మరో 20 రోజుల్లో తిరిగి పర్యటించి పనుల పురోగతిని పరిశీలిస్తానని సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు అధికారులు బాధ్యతగా పనిచేయాలని చెబుతూ బస్తీ వాసులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు మురుకుంట్ల అరవింద్ శర్మ, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యంలో మహా పాదయాత్ర

శబరిమల బాట పట్టిన మామిడిపల్లి అయ్యప్ప స్వాములు!

లోక కల్యాణమే లక్ష్యంగా 8 మంది స్వాముల ఆధ్యాత్మిక సంకల్పం.. ఇరుముడులతో మణికంఠుని సన్నిధికి పయనం



మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి: ముత్తయ్య । అక్టోబర్ 30, 2026 : అయ్యప్ప నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. లోక కల్యాణం, సకల జనుల సుఖ సంతోషాలు, ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎనిమిది మంది అయ్యప్ప స్వాములు చేపట్టిన మహా పాదయాత్ర భక్తి శ్రద్ధలతో కొనసాగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ బాల మణికంఠ స్వామి దేవాలయం నుంచి కేరళ రాష్ట్రంలోని పవిత్ర శబరిమల శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం వరకు స్వాములు కాలినడకన యాత్రను ప్రారంభించారు. అయ్యప్ప స్వామిపై అచంచలమైన భక్తి విశ్వాసాలతో, కఠిన దీక్షా నియమాలను ఆచరిస్తూ, గురుస్వాముల మార్గదర్శకత్వంలో ఇరుముడులు ధరించి స్వాములు తమ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని సాగిస్తున్నారు. అడుగడుగునా 'స్వామియే శరణం అయ్యప్ప' అనే శరణుఘోషతో, భజనలు, భక్తి కీర్తనలు, మణికంఠుని నామస్మరణతో ముందుకు సాగుతూ తమ యాత్రను భగవంతునికి అంకితం చేస్తున్నారు. అయ్యప్ప దీక్ష అనేది కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు.. ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ, సహనం, సమానత్వం, భక్తి భావాలను పెంపొందించే ఆధ్యాత్మిక సాధన. నల్లని వస్త్రధారణ, నియమ నిష్ఠలు, సాత్విక జీవనం, గురుస్వాముల పట్ల గౌరవం, సర్వమత సమభావం వంటి విలువలను పాటిస్తూ స్వాములు మణికంఠుని అనుగ్రహం కోసం ఈ కఠిన పాదయాత్రను కొనసాగిస్తున్నారు. ఎన్నో కిలోమీటర్ల దూరం, మార్గమధ్యలో ఎదురయ్యే శారీరక ఇబ్బందులు, ప్రకృతి సవాళ్లను భక్తి సంకల్పంతో అధిగమిస్తూ సాగించే ఈ పాదయాత్ర ప్రతి అడుగులోనూ ఆధ్యాత్మికతను చాటుతోంది. తమ వ్యక్తిగత కోరికలతో పాటు సమస్త మానవాళి శ్రేయస్సు, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని స్వాములు మణికంఠుడిని ప్రార్థిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వాముల మహా పాదయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తవ్వాలని, స్వాములందరూ క్షేమంగా శబరిమల చేరుకుని మణికంఠుని దివ్య దర్శనం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఆ హరిహరసుతుని కరుణాకటాక్షాలు యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థించారు. పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుక్క శివకుమార్, బీఆర్ఎస్ నాయకుడు నిమ్మల నరేందర్ గౌడ్, అయ్యప్ప స్వాములు, స్థానిక పెద్దలు, గ్రామస్తులు పాల్గొని స్వాములకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతు సెగ.. రాజకీయ రగడ

సబితమ్మతో పీఏసీఎస్ చైర్మన్ భేటీ.. మహేశ్వరంలో కొత్త చర్చకు తెర!

అధికార కాంగ్రెస్ తీరుపై బీఆర్ఎస్ విమర్శల వేళ.. మాజీ మంత్రి వద్దకు సహకార సంఘం పాలకవర్గం!

మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి: ముత్తయ్య । అక్టోబర్ 30, 2026 : మహేశ్వరం రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో.. మహేశ్వరం మండల పీఏసీఎస్ పాలకవర్గ ప్రతినిధులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మండల పీఏసీఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ కాడమోని ప్రభాకర్ ముదిరాజ్, పోచారం సుధాకర్ శుక్రవారం సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ ఆత్మీయ భేటీ ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది.

ఒకవైపు రైతు సమస్యలు.. మరోవైపు రాజకీయ సమీకరణాలు!

రైతుల సమస్యలపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేతలు నిలదీస్తున్న నేపథ్యంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. రైతాంగానికి సంబంధించిన సమస్యలు, సహకార రంగం పరిస్థితులపై ప్రతిపక్షాలు గళమెత్తుతున్న వేళ పీఏసీఎస్ పాలకవర్గ ప్రతినిధులు మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యేను కలవడం వెనుక రాజకీయంగా ఎలాంటి పరిణామాలు ఉంటాయన్న చర్చ మొదలైంది.

పీఏసీఎస్ భేటీ.. రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ!

సహకార రంగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో భేటీ కావడం కేవలం మర్యాదపూర్వక పలకరింపుతో ముగుస్తుందా? లేక రానున్న రోజుల్లో మహేశ్వరం రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు



నాంది పలుకుతుందా? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ సమావేశంలో రాజకీయ చర్చలు జరిగినట్లు గానీ, ఎలాంటి రాజకీయ నిర్ణయాలు తీసుకున్నట్లు గానీ అధికారిక సమాచారం లేదు. అయినప్పటికీ ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

సాంప్రదాయానికి సరికొత్త చిరునామా.. రామ్‌రాజ్ కాటన్

బాలాపూర్‌లో నూతన షోరూమ్ ప్రారంభం.. పురుషులు, మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక కలెక్షన్లు

మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి । అక్టోబర్ 30, 2026 : హైదరాబాద్ నగరంలో సంప్రదాయ భారతీయ వస్త్రాలకు పెరుగుతున్న ఆదరణకు అనుగుణంగా ప్రముఖ వస్త్ర బ్రాండ్ రామ్‌రాజ్ కాటన్ తన వ్యాపార విస్తరణలో మరో అడుగు ముందుకేసింది. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బాలాపూర్ సత్యసాయినగర్, ఆర్‌సీఐ రోడ్డులో నూతన షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించింది. నాణ్యత, సంప్రదాయం, ఆధునికత కలబోతగా వస్త్రాలను అందించడమే లక్ష్యంగా ఈ నూతన స్టోర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే స్వచ్ఛమైన కాటన్ దుస్తులను వినియోగదారులకు అందించడంలో రామ్‌రాజ్ కాటన్ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన వస్త్రాలను ఆధునిక డిజైన్లలో, అందుబాటు ధరల్లో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. నూతన షోరూమ్‌లో పురుషులు, మహిళలు, చిన్నారుల కోసం విభిన్న రకాల వస్త్ర కలెక్షన్లను అందుబాటులో ఉంచినట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. సంప్రదాయ దుస్తులతో పాటు ఆధునిక అభిరుచులకు అనుగుణమైన డిజైన్లు వినియోగదారులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. పండుగలు, వివాహాలు, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాలకు అనువైన వస్త్రాలను ఒకే చోట ఎంపిక చేసుకునే సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ వినియోగదారుల అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా విస్తృత శ్రేణి ఉత్పత్తులను అందించనున్నట్లు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న బాలాపూర్, మహేశ్వరం



పరిసర ప్రాంతాల్లో వస్త్ర వ్యాపారానికి పెరుగుతున్న అవకాశాల నేపథ్యంలో రామ్‌రాజ్ కాటన్ నూతన షోరూమ్ ప్రారంభం స్థానిక వినియోగదారులకు మరింత చేరువైన షాపింగ్ అవకాశాన్ని కల్పించనుంది. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కుటుంబ సభ్యులందరికీ నచ్చే కలెక్షన్లతో ఈ స్టోర్‌ను తీర్చిదిద్దినట్లు నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులు షోరూమ్‌ను సందర్శించి నాణ్యమైన వస్త్రాల కొనుగోలుతో సరికొత్త షాపింగ్ అనుభూతిని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామ్‌రాజ్ సంస్థ జనరల్ మేనేజర్ శైలేంద్ర నాయర్, ప్రతినిధులు ప్రకాష్, గణేష్, సతీష్, రవికుమార్, వెంకటేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో వన్ వే

హైదరాబాద్ : హైదరాబాద్ ఐటీ కారిడార్‌తో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిత్యం వేలాది మంది టెక్కీలను, వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రెండు ప్రధాన జంక్షన్లలో త్వరలోనే వన్ వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో సమగ్ర ట్రాఫిక్ అధ్యయనం నిర్వహించిన అధికారులు, వన్ వే విధానం అమలు సాధ్యాసాధ్యాలను పూర్తిస్థాయిలో పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో కేబీఆర్ పార్క్ వద్ద అమలు చేసిన వన్ వే వల్ల దాదాపు 6 కిలోమీటర్ల మేర అదనపు ప్రయాణం చేయాల్సి రాగా, ఇక్కడ మాత్రం వాహనదారులకు కేవలం 2 కిలోమీటర్ల మేర మాత్రమే అదనపు ప్రయాణ భారం పడనుంది. ఈ కొత్త ట్రాఫిక్ నిబంధనల వల్ల ఐటీ కారిడార్‌లో కనీసం 40 శాతం మేర ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దశలవారీగా చేపట్టనున్న ఈ ప్రణాళికలో భాగంగా.. తొలుత వారం, రెండు వారాల వ్యవధిలోనే రాయదుర్గం జంక్షన్ పరిసరాల్లో వన్ వే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మరో కీలక

భారంగా ఇళ్ల నిర్మాణం

హైదరాబాద్ : దేశీయ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రస్తుతం ధరల మంట తీవ్రంగా వేధిస్తోంది. నిర్మాణ రంగానికి అత్యంత కీలకమైన సిమెంట్, ఇనుము , ఇటుకలు, కంకర , ఇతర ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం కొత్త ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని ఆకాశానికి ఎత్తేసింది. దీనికి తోడు రవాణా ఖర్చులు, నిపుణులైన కార్మికుల వేతనాలు పెరగడంతో ప్రాజెక్ట్ వ్యయాలు అంచనాలను మించిపోతున్నాయని రియల్ ఎస్టేట్ డెవలపర్లు , బిల్డర్ల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొంతకాలంగా అంతర్జాతీయ పరిణామాలు, ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో స్టీల్ మరియు సిమెంట్ ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ప్రాజెక్ట్ ప్రారంభంలో అనుకున్న అంచనా వ్యయానికి , ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి అవుతున్న వాస్తవ వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని డెవలపర్లు వాపోతున్నారు. లాభాల మార్జిన్లు దారుణంగా పడిపోవడమే కాకుండా, ఇప్పటికే ప్రారంభించిన ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేయడం బిల్డర్లకు పెద్ద సవాలుగా మారింది. పెరిగిన నిర్మాణ వ్యయాల భారాన్ని మోయలేక డెవలపర్లు అనివార్యంగా ఆ అదనపు భారాన్ని చదరపు అడుగు రేట్ల రూపంలో గృహ కొనుగోలుదారులపైనే వేయాల్సి వస్తోంది. దీనివల్ల హైదరాబాద్ వంటి మహానగరాల్లో సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఇళ్ల ధరలు మరింత దూరమవుతున్నాయి. ఇప్పటికే రూ. 50 లక్షల లోపు లభించే అందుబాటు ధరల ఇళ్ల ప్రాజెక్టులు తగ్గిపోయి, సగటు ప్లాట్ , ఫ్లాట్ ధర రూ. 1 కోటికి పైగా చేరుకోవడానికి ఈ నిర్మాణ వ్యయాల పెరుగుదలే ప్రధాన కారణం. ఈ సంక్షోభం నుంచి నిర్మాణ రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని నరెడ్కో , క్రెడాయ్ వంటి రియల్టర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిర్మాణ సామాగ్రిపై విధిస్తున్న జీఎస్టీ శ్లాబులను తగ్గించాలని, సిమెంట్ మరియు స్టీల్ ధరల కృత్రిమ పెంపుదలను అరికట్టేందుకు ఒక నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం తగ్గితేనే గృహ కొనుగోలుదారులకు ఉపశమనం లభించడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరమైన వృద్ధి సాధిస్తుందని బిల్డర్లు పేర్కొంటున్నారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టివేత

హైదరాబాద్ మలక్‌పేట్‌లో నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ రవాణాపై పోలీసులు తనిఖీలునిర్వహించారు. మూసారాంబాగ్ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టుబడింది. ఆటోలో అక్రమంగా పొగాకు ఉత్పత్తులను తరలిస్తుండగా ఎస్ఐ తేజ్య నాయక్ బృందం గుర్తించింది. ఆటో డ్రైవర్ను విచారించగా సిరిపురం కాలనీలోని గోదాములో భారీ నిల్వలుబయటపడ్డాయి. పోలీసులు గోదామును తనిఖీ చేసి నిషేధిత పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి మధుసూదన్ (61), ఆటో డ్రైవర్ ధూప సుధాకర్ను అదుపులోకి తీసుకున్నారు. గుడిమల్కాపూర్, కిషన్‌బాగ్ ప్రాంతాల నుంచి పొగాకు ఉత్పత్తులు తీసుకొచ్చి మలక్‌పేట్ పరిసర ప్రాంతాల్లోని పాన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడి అయింది. నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసారు.

మచిలీపట్నంలో వర్ష బీభత్సం..

రెండు రోజులైనా తగ్గని నీరు

జలమయమైన రహదారులు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు

మచిలీపట్నం అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మచిలీపట్నం నగరం జలమయమైంది. ఎటు చూసినా రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసి రెండు రోజులు గడుస్తున్నప్పటికీ రహదారులపై నీరు ఏమాత్రం తగ్గకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు వర్షపు నీటితో నిండిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్లపై నిలిచిపోయిన నీరు డ్రైనేజీలను తలపిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు సకాలంలో బయటకు వెళ్లకపోవడంతో నగరంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వలను తొలగించి, రహదారులపై సాధారణ పరిస్థితులు నెలకొనేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు ఒకవైపు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండగా, మరోవైపు రెండు రోజులైనా రోడ్లపై నీరు తగ్గకపోవడం నగర ప్రజలకు మరింత భారంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించే చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూరలో బల్లి

హైదరాబాద్ జేఎన్‌టీయూ మంజీర హాస్టల్‌లో విద్యార్థులకు వడ్డించిన భోజనంలో బల్లి కనిపించడం కలకలం రేపింది. గురువారం రాత్రి డిన్నర్ చేసేందుకు వెళ్లిన విద్యార్థులకు వడ్డించిన కూరలో బల్లి కనిపించడంతో వారు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే కూరలో ఉన్న బల్లిని సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆహారంలో బల్లి రావడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో భోజన నాణ్యతను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడవద్దని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో పరిశుభ్రత పాటించడంతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

అతిగా ఫోన్ మాట్లాడుతోందని బిడ్డను గొంతుపిసికి చంపిన తల్లి


షాద్‌నగర్

బిడ్డ అతిగా ఫోన్ మాట్లాడుతోందని, తాను చెప్పిన మాట వినడం లేదని ఓ తల్లి ఆమెను దారుణంగా గొంతుపిసికి చంపేసింది. ఈ ఘటన షాద్‌నగర్ ఏరియాలోగల కొత్తూరు మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. షాద్‌నగర్ డీసీపీ శిరీష వెల్లడించిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని హనుమాన్ కాలనీలో నివాసం ఉండే ఆటోడ్రైవర్ ముయ్యడి రాజు, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సువర్చల (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ముయ్యడి రాజు భార్య కల్లుకు బానిసైంది. ఈ క్రమంలో కల్లు తాగవద్దన్న కుమార్తె సువర్చలతో నిత్యం గొడవ పడేది. ఈ నెల 27న సాయంత్రం మరోమారు వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపోయిన తల్లి కుమార్తెను గొంతుపిసికి చంపేసింది. అనంతరం ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు బాలిక మెడకు చీర చుట్టింది. తర్వాత భర్తకు ఫోన్ చేసి రప్పించింది. బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటీవలే బాలిక పుష్పవతి కావడంతో కడుపునొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని తండ్రి రాజు భావించాడు. అయితే రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు బాలిక కడుపునొప్పితో కాదు, ఊపిరాడక చనిపోయిందని పోస్టుమార్టం రిపోర్టులో తెలిసింది. దాంతో వారు తల్లిని అనుమానించి తమదైన శైలిలో ప్రశ్నించారు. దాంతో నిందితురాలు నేరం అంగీకరించింది. ఫోన్ అతిగా మాట్లాడుతోందని, చెప్పిన మాట వినట్లేదని, అందుకే చంపేశానని చెప్పింది

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

ఏపీకి మళ్లీ వర్ష గండం

అర్నబ్ తుపాను ప్రభావం నుంచి ఏపీ ఇంకా కోలుకోకముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దక్షిణ అండమాన్ సముద్రం పరిసరాల్లో ఏర్పడిన ఈ వాతావరణ వ్యవస్థ రానున్న రోజుల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో గంటకు 45?55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. సముద్రంలో అలజడి ఉండే అవకాశం నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికే అర్నబ్ తుపాను కారణంగా పంటలు దెబ్బతిని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో మరో అల్పపీడనం ఏర్పడటంతో కోస్తా జిల్లాల ప్రజల్లో ఆందోళన మొదలైంది. వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండండి.



రెండు భాగాలుగా విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన'..

తొలిసారి విజయ్‌తో కీర్తి సురేష్ జోడీ

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'రణబాలి'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన.. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన' అనే మాస్ రూరల్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. 'రాజా వారు రాణి గారు' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రవికిరణ్ కోలా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో మంచి అంచనాలు ఏర్పడగా.. తాజాగా సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'రౌడీ జనార్ధన' సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం మొదలైంది. కథా పరిధి, సినిమాలోని అంశాల నేపథ్యంలో రెండు భాగాలుగా తీసుకొస్తే బాగుంటుందనే అభిప్రాయంతో చిత్ర బృందం ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అయితే ఈ వార్తలపై నిర్మాతలు లేదా దర్శకుడు ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతుందా? లేక ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇటీవల టాలీవుడ్‌లో రెండు భాగాలుగా సినిమాలను విడుదల చేసే విధానం పెరిగింది. కథకు విస్తృతమైన పరిధి ఉన్నప్పుడు, పాత్రలు మరియు కథాంశాలను మరింత వివరంగా చూపించడానికి దర్శకులు ఈ పద్ధతిని ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ సినిమా కూడా రెండు భాగాలుగా వస్తుందనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరిద్దరూ కలిసి నటిస్తున్న తొలి సినిమా ఇదే కావడంతో ఈ జోడీపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కీర్తి సురేష్‌కు కథలో ఎలాంటి పాత్ర ఇచ్చారు? విజయ్‌తో ఆమె కెమిస్ట్రీ ఎలా ఉండబోతోంది? అనే విషయాలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. 'రౌడీ జనార్ధన'ను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. క్రిస్టో జేవియర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ కథగా ఈ సినిమా రూపొందుతోంది. విజయ్ దేవరకొండ మాస్ ఇమేజ్‌కు తగిన కథ, రవికిరణ్ కోలా దర్శకత్వం, కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటించడం ఈ ప్రాజెక్టుపై అంచనాలను పెంచుతున్నాయి.





'ఛావా' దర్శకుడి కొత్త సినిమా..

శ్రద్ధా కపూర్ 'ఈతా' ట్రైలర్ విడుదల!

బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'ఛావా' చిత్రానికి దర్శకత్వం వహించిన టాలెంటెడ్ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఈతా' ప్రముఖ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. మహారాష్ట్ర సాంస్కృతిక జానపద కళాకారిణి, లావణీ లెజెండ్ విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ బయోపిక్ రూపొందుతోంది. ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ విఠాబాయి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి కనిపించనున్నారు. ఆమె కెరీర్‌లో ఇదొక మైలురాయిగా నిలిచే పాత్ర అని ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే లావణీ నృత్య రూపం మరియు ఒక సాధారణ మహిళా కళాకారిణి అసాధారణ విజయాలు సాధించే ప్రయాణాన్ని ట్రైలర్‌లో అత్యద్భుతంగా హైలైట్ చేశారు. ప్రముఖ నిర్మాత దినేష్ విజాన్ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టాలెంటెడ్ యాక్టర్ రణ్‌దీప్ హూడా కూడా ఒక కీలకమైన పాత్రలో నటిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PUBLICATIONS. AT M/S SMIL YS ONLINE H.NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500 O70 AND PUBLISHED AT VIPLAV MEDIA PUBLICATIONS. H.NO : 18-7-496 KANDIKAL GATE, UPPUGUDA, HYDERABAD, TELANGANA - 500 053. CEO & CHIEF EDITOR VANGA NAGARAJ REDDY (RAJU), EDITOR VANGA VIPLAV TEJA. PRGI : TGBIL/26/A2289. PHONE NO: +9184990 94183, +9193945 17067